
గుంటూరు - ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | సంపుటి: 10 | సంచిక: 256 | పేజీలు: 8+4 | వెల రూ.5

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..



తోడు కోసం 4,126 కిమీ
## కుక్కల ప్రేమ యాత్ర



2


సికింద్రాబాద్-శ్రీకాకుళం మధ్య
## 16 పండుగల రైళ్లు



2

మోహినీ అలంకారంలో
## జగన్మోహనాకారుడు

మోహనరూపంలో భక్తులను కటాక్షించిన శ్రీ మలయప్పస్వామి



2

ముఖ్యమంత్రి చంద్రబాబు
## నేడు బెంగళూరు పర్యటన

21, 22 తేదీల్లో కుప్పంలో అభివృద్ధి కార్యక్రమాలకు హాజరు

రూ.289.5 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు...

రూ.38.5 కోట్ల పనులకు శంకుస్థాపనలు

5



# పేదలకు 'పట్టా' భిషేకం

## నాడు భయం.. నేడు భరోసా

కాబోయే విశ్వనగరం విశాఖ

రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు

ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేలా చర్యలు

విశాఖ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

(విశాఖపట్నం, మనం ప్రత్యేక ప్రతినిధి): విశాఖలో శనివారం సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన చేశారు. పెదజాలరిపేటలో ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్ను వర్చువల్గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు, సముద్ర వ్యర్థాలను సేకరించే పారిశుధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణతో లభించే ప్రోత్సాహంతో తమకు అదనపు ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రికి మత్స్యకారులు తెలిపారు సముద్ర ఉపరితలంలో సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకం వేసే విధానాన్ని పరిశీలించిన సీఎం చంద్రబాబు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ద్వారా లభించే ప్రోత్సాహకాన్ని మత్స్యకారులకు అందించారు. సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత వలలు తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లను అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా ఏకంగా 1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎంకు అధికారులు వివరించారు. 'మ్యాన్హోళ్లు, మురుగు కాల్వల శుభ్రత కోసం ...మిగతా 2లో

'కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం. ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తాం. రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు అందిస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వ విధానం. విశాఖలోని పంచగ్రామాల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. ఇంకా 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.. వారందరికీ త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నాం. వివిధ జిల్లాల్లో ఇప్పటికే 12 వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చాం.



## 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

నూతన పెన్షన్ల దరఖాస్తుల పరిశీలనలో చేతివాటానికి తావివ్వొద్దు

చేనేతల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం.. ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వొద్దు

నేతన్నలకు ఆర్థిక మేలు చేకూర్చాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యం

అక్రమ వసూళ్లకు పాల్పడిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరు ఉద్యోగులపై మంత్రి సవిత ఆగ్రహం

తక్షణమే సస్పెన్షన్ చేయాలని ఆదేశం

మంత్రి సవిత ఆదేశాల మేరకు రమణారెడ్డి, శీనా నాయక్ సస్పెన్షన్

అమరావతి/శ్రీసత్యసాయి,సెప్టెంబర్,19,(మనం ప్రత్యేక ప్రతినిధి) : 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేయడమే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎటువంటి అక్రమాలు, అవినీతి తావులేకుండా అర్హులైన నేతన్నలందరికీ పెన్షన్లు అందజేసేలా దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నేపథ్యంలో నేతన్నల దరఖాస్తుల పరిశీలనలో జరుగుతున్న చేతివాటంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో సదుద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు ...మిగతా 2లో

రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి
## ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది



మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ: సెప్టెంబర్ 19,(మనం ప్రతినిధి.): ఏపీలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శనివారం మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న జయంతి వేడుకలు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ...మిగతా 2లో



5

'వికసిత భారత్ 2047'
## లక్ష్య సాధనే ధ్యేయం

న్యూఢిల్లీలో ఏపీ భవన్ విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

వ్యవసాయ, ఎనర్జీ రంగాల్లో సవాళ్లు-ప్రైవేట్ భాగస్వామ్యంపై విస్తృత చర్చ

త్వరలో మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ప్రారంభం

## ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదు

అప్రమత్తత..సత్వర చికిత్స

తగ్గుతున్న మరణాలు

25 వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన కార్యక్రమాలు

గోడపత్రిక ను ఆవిష్కరించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి,సెప్టెంబర్, 19,(మనం ప్రతినిధి): ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ప్రపంచంలో 3500 జాతుల పాములున్నాయని, వీటిలో కొన్ని జాతులు మాత్రమే ...మిగతా 5లో

## మేమిద్దరం మంచి దోస్తులం



కానీ, ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటం

చైనాపై ట్రంప్ వ్యాఖ్యలు

నెలాఖరులో జిన్‌పింగ్ అమెరికా పర్యటన

వాషింగ్టన్, సెప్టెంబర్ 19: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక ...మిగతా 2లో

## గ్యాలరీల్లో ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట యంత్రాంగం ఏర్పాటు చేయాలని ఆదేశం



3




## అమిత్ షాకు అస్వస్థత

హుబ్బళ్లి, సెప్టెంబర్ 19: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అస్వస్థతకు గురయ్యారు. షెడ్యూల్ ప్రకారం శనివారం ఆయన కర్ణాటకలోని హుబ్బళ్లిలో రూ.700 కోట్లతో నిర్మించిన కేఎల్ఈ జగద్గురు గంగాధర్ మహాస్వామిగళు మూరుసావిరమఠ్ మెడికల్ కళాశాల నూతన భవనంతోపాటు, 1,200 పడకల కేఎల్ఈ హాస్పిటల్ అండ్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ ను ప్రారంభించాల్సి ఉంది. ఈ క్రమంలో, శుక్రవారం రాత్రే ఆయన హుబ్బళ్లిలోని హోటల్కు చేరుకున్నారు. అక్కడ అస్వస్థతకు గురికావడంతో వైద్యుల సలహా మేరకు కార్యక్రమానికి ...మిగతా 2లో


ప్రపంచానికి
## నీటి గండం

వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు

ఇంకిపోతున్న భూగర్భ జలాలపై డబ్ల్యూఎంవో ఆందోళన




వాషింగ్టన్, సెప్టెంబర్ 19: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల కారణంగా భూమిపై నీటి వ్యవస్థ (వాటర్ సైకిల్) తీవ్ర అస్తవ్యస్తంగా, అత్యంత ప్రమాదకరంగా మారుతోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. గ్లేసియర్లు (హిమానీనదాలు) వేగంగా కరిగిపోతుండటం, మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోతుం డటంతో ఒకచోట భారీ వరదలు, మరోచోట కరవులు సంభవిస్తున్నాయని పేర్కొంది. రానున్న భయంకరమైన ఎల్ నినో ప్రభావం ఈ సంక్షోభాన్ని మరింత ...మిగతా 2లో



## చిట్టి రోబో మనిషిని మింగేస్తుందా?

ఎఐతో ప్రశ్నార్ధకంగా మానవ మనుగడ?

మేధో వికాసమా? మానవాళి వినాశనమా?




హైదరాబాద్, సెప్టెంబర్ 19(మనం న్యూస్): సైన్స్ ఫిక్షన్ నవలల్లోని కల్పన కాదు.. సిల్వర్ స్క్రీన్ పై విస్మయం గొలిపిన మాయాజాలం అంతకన్నా కాదు. నేడు మన కళ్ల ముందే రూపుదిద్దుకుంటున్న, అత్యంత వేగంగా ...మిగతా 2లో

3 కంపెనీలను హ్యాక్ చేసిన
## జెమినై ఏఐ

ధృవీకరించిన గూగుల్




2

# పేదలకు 'పట్టా' భిషేకం

(మొదటి పేజీ తరువాయి)

జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో సీఎం పరిశీలించారు. జీవీఎంసీ సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, భవిష్యత్తు లక్ష్యాలపై బ్లూమ్బెర్గ్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చించారు.

సాగర తీరంలో మురి మిక్చర్ విక్రయించే మహిళ జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్న సీఎం చంద్రబాబు, ఆమె విక్రయించే మురిమిక్చర్ను కొని ఆస్వాదించారు. మురి మిక్చర్ విక్రయించే మహిళ ఒంటరి మహిళ అని తెలుసుకున్న సీఎం, ఆమెకు పెన్షన్ మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు.

**28,445 పేద కుటుంబాలకు శాశ్వత యాజమాన్య హక్కులు**

విశాఖపట్నంలో జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 28,445 పేద కుటుంబాలకు శాశ్వత యాజమాన్య హక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదవాడి సొంతింటి కల సాకారం చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన విధానమని, విశాఖను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

**పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం**

''కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం. ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తాం. రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు అందిస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వ విధానం. విశాఖలోని పంచగ్రామాల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. ఇంకా 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.. వారందరికీ త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నాం. వివిధ జిల్లాల్లో ఇప్పటికే 12 వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చాం.

**కాబోయే విశ్వనగరం విశాఖ**

విశాఖ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని ముఖ్యమంత్రి అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగామని చెప్పారు. విశాఖ కాబోయే విశ్వనగరమని, అభివృద్ధి ఫలాల్లో పేదలకూ భాగస్వామ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విశాఖను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 145 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని తెలిపారు. తిరుమలలో 89.4 శాతం పచ్చదనం ఉన్నట్లే విశాఖలోనూ పచ్చదనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విశాఖ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సహకరించిందని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖ అభివృద్ధి ఇక ఆగదని స్పష్టం చేశారు.

**రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రం**

ఎల్నినో ప్రభావంతో విశాఖలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని చంద్రబాబు తెలిపారు. విశాఖకు వచ్చిన వెంటనే తాగునీటి పరిస్థితిపై సమీక్షించానని, సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలు తీసుకొచ్చామని, వాటిని వంశధారకు అనుసంధానించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మార్కాపురానికి నీరందిస్తున్నామని తెలిపారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు**

గత ప్రభుత్వ హయాంలో విశాఖలో భూ వివాదాలు, కూల్చివేతలు, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. రుషికొండలో నిర్మించిన భవనాల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుని ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని, డేటా సెంటర్ల విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. విశాఖ ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, అచ్చెన్నాయుడు, బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ పాల్గొన్నారు.

# సికిందరాబాద్-శ్రీకాకుళం మధ్య 16 పండుగల రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** రాబోయే పండగల సీజన్ను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాల్లో ప్రత్యేక రైలు సర్వీసులు నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య 16 ప్రత్యేక రైళ్ల సర్వీసులను నడపనున్నట్లు శనివారం మధ్యాహ్నం ప్రకటించారు. ఈ ప్రత్యేక సర్వీసులు అక్టోబరు 6 నుంచి నవంబరు 25వరకు ప్రతి మంగళ, బుధ వారాల్లో రాకపోకలు సాగిస్తాయని ద.మ.రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. 07037 నంబర్ రైలు చర్లపల్లి నుంచి అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో బయల్దేరి మరుసటి రోజు శ్రీకాకుళం చేరుకుంటుంది. అలాగే, 07038 నంబర్ రైలు అక్టోబర్ 7, 14, 21, 28, నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ నుంచి బయల్దేరి మరుసటి రోజు చర్లపల్లికి వెళ్తుంది. అయితే, ఈ రైళ్లు బయల్దేరే, గమ్యస్థానానికి చేరుకొనే సమయాలను మాత్రం ఇంకా అధికారులు ప్రకటించలేదు. ఈ ప్రత్యేక రైలు సర్వీసులు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు జంక్షన్, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగిస్తాయి. వీటిలో ఏసీ టూ టైర్, ఏసీ త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్ లుంటాయి.

# తోడు కోసం 4,126 కిమీ కుక్కల ప్రేమ యాత్ర

**వాషింగ్టన్, సెప్టెంబర్ 19 (మోంటానా/అమెరికా):** ప్రపంచంలో అంతరించిపోయే దశలో ఉన్న జంతు జాతుల్లో ఆఫ్రికన్ అడవి కుక్కలు కూడా ఉన్నాయి. సాధారణ కుక్కల కంటే భిన్నమైన ఈ జంతువులు ఇప్పుడు దాదాపు 6,000 మాత్రమే మిగిలాయి. ఈ నేపథ్యంలో ఆఫ్రికన్ అడవుల్లోని మూడు మగ కుక్కలు తోడు కోసం ఏకంగా 4,126 కి.మీ. నడిచి కనుమరుగవుతున్న జీవజాతుల్లో కొత్త ఆశలు రేపాయి. గతంలో తాము రికార్డు చేసిన ప్రయాణాల కంటే ఇది చాలా అసాధారణమని అమెరికాలోని మోంటానా స్టేట్ యూనివర్సిటీ సంరక్షణ శాస్త్రవేత్త స్కాట్ క్రీల్ తెలిపారు. జీపీఎస్ ట్రాకింగ్ కాలర్లు అమర్చడం ద్వారా గత పదహారేళ్లలో 500కు పైగా ఆఫ్రికన్ అడవి కుక్కలను ఈయన అధ్యయనం చేశారు.ఈ అడవి కుక్కల విషయానికి వస్తే ప్రతి గుంపులోనూ ఒక ఆల్ఫా మగకుక్క మరో ఆల్ఫా ఆడకుక్కతో మాత్రమే కలిసి సంతానోత్పత్తి చేస్తుంది. ఆయా గుంపులకు నాయకులుగా ఆధిపత్యం చెలాయించే వాటిని ఆల్ఫా కుక్కలని అంటారు. తోడు కోసం ఈ కుక్కలు చేసే ప్రయాణాలు చాలా ప్రమాదకరంగానూ ఉంటాయి. అడవి జంతువుల మాంసం కోసం ఏర్పాటుచేసే తీగ ఉచ్చులు వీటికి ప్రాణాంతకంగా మారుతాయి. సింహాలు, నదుల్లోని మొసళ్లతోనూ ముప్పే. ఈ కారణంగా తోడు కోసం బయలుదేరే అడవి కుక్కల్లో సగానికి పైగా మార్గమధ్యంలోనే చనిపోతాయి.

# అమిత్ షాకు అస్వస్థత

(మొదటి పేజీ తరువాయి)

హాజరుకాకుండా హోటల్లోనే ఉండిపోయారు. అమిత్ షా గైర్హాజరైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, కర్ణాటక వైద్య విద్యాశాఖ మంత్రి శరణ్ ప్రకాశ్ పాటిల్, మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కేఎల్ఈ సొసైటీ ఛైర్మన్, రాజ్యసభ మాజీ ఎంపీ ప్రభాకర్ కోరే మాట్లాడుతూ.. ఈ చరిత్రాత్మక కార్యక్రమానికి అమిత్ షా హాజరు కావాల్సి ఉన్నప్పటికీ.. ఆరోగ్య కారణాల రీత్యా దూరంగా ఉన్నారని వెల్లడించారు.

# మోహినీ అలంకారంలో జగన్మోహనాకారుడు

**తిరుమల, సెప్టెంబర్ 19 మనం న్యూస్:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన శనివారం ఉదయం శ్రీ మలయప్పస్వామివారు మోహినీ అవతారంలో సర్వాలంకార భూషితుడై జగన్మోహనాకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై భక్తులకు అభయమిచ్చారు.

గజరాజులు ముందుగా నడుస్తుండగా, భక్తబృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి పల్లకీసేవ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

మోహినీ రూపంలో స్వామివారి దర్శనం జగత్తును ఆవరించిన మాయామోహాన్ని అధిగమించి భగవంతుని శరణు పొందాలనే ఆధ్యాత్మిక సందేశాన్ని అందిస్తుంది. సర్వమూ భగవంతుని లీలావిలాసమేనని, భక్తి మార్గమే మాయామోహాల నుంచి విముక్తికి దారి చూపుతుందని ఈ అలంకారం చాటిచెబుతోంది.

పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన గరుడ వాహనసేవకు 108 వైష్ణవ దివ్యదేశాల్లో విశిష్ట స్థానం ఉంది. భగవంతుని వాహనమైన గరుడుని దర్శించడం ద్వారా భక్తిలో శరణాగతి, జ్ఞానం, వైరాగ్యం కలగాలని స్వామివారు అనుగ్రహిస్తున్నారనే విశ్వాసం ఉంది. గరుడుని దర్శనం సర్వపాపాలను హరిస్తుందని, భక్తులకు ఆధ్యాత్మిక శుభఫలాలను ప్రసాదిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి.

ఈ వాహనసేవలో పెద్దజీయర్స్వామి, చిన్నజీయర్స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, పలువురు బోర్డు సభ్యులు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి,సీవీఎస్వో మురళీకృష్ణ,ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# 50 ఏళ్లు నిండిన నేతన్నలందరికీ పెన్షన్లు

(మొదటి పేజీ తరువాయి)

చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న లక్ష్యాన్ని నీరు గార్చుతున్న అధికారులపై కొరడా ఝుళిపించారు. దరఖాస్తుల పరిశీలన పేరుతో పచ్చనోట్లకు కక్కుర్తిపడిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. నూతన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకంపై అమలు తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. నూతన పెన్షన్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి...వాటి పరిశీలన గురించి ఆరా తీశారు. నూతన పెన్షన్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16,521 దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటింటికీ వెళ్లి అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 84 వేలకుపైగా చేనేతలకు పెన్షన్లు అందజేస్తున్నామన్నారు.

**అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం**

శ్రీసత్యసాయి, అనంతపురం సహా పలు జిల్లాల్లో దరఖాస్తు దారుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు తెలిసిందని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. చేనేతలందరికీ ఆర్థిక మేలు కలుగజేయాలన్నది సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఉచిత విద్యుత్, నేతన్నల సేవలో పథకం సహా పలు పథకాలను ఇటీవల ప్రారంభించారన్నారు.ఇపుడు 50 ఏళ్లు నిండిన చేనేతలకు నూతన పెన్షన్లు అందజేయాలని నిర్ణయించారన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎంతో సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నీరుగార్చేలా కొందరు ఉద్యోగులు అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన ప్రతి నేతన్నకూ పెన్షన్ అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఎటువంటి అపోహలకు నేతన్నలు గురికావొద్దని, ఎవ్వరికీ రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరంలేదని చేనేతలకు తెలిపారు. అర్హత ఉంటే ప్రభుత్వమే పెన్షన్ అందజేస్తుందని మంత్రి సవిత తెలిపారు.

**ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్**

శ్రీసత్యసాయి జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తుల పరిశీలన సమయంలో చేనేతల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసిందని మంత్రి సవిత మండిపడ్డారు. తాము ఇచ్చే అనుమతులతోనే పెన్షన్లు వస్తాయంటూ డీవో రమణారెడ్డి. ఏడీవో శీనా నాయక్ నేతన్నల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి గండికొడుతున్న ఆ ఇద్దరు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియాను ఆదేశించారు. చేనేతల నుంచి వసూళ్లకు పాల్పడితే సహించేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు. అర్హులను గుర్తించే సర్వేలో రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లాల్లో పర్యటించి స్వయంగా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆ ఇద్దరు ఉద్యోగులనూ తొలగిస్తూ కమిషనర్ రేఖారాణి ఉత్తర్వులు జారీచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని జిల్లాల చేనేత, జౌళి శాఖాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

డా. జి. లక్ష్మీశలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టరేట్కు విచ్చేసిన మంత్రివర్యులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమ ప్రారంభంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోయి భీమన్న జీవిత ఛాయాచిత్రమాలికను మంత్రి దుర్గేష్ పరిశీలించారు. అనంతరం వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి, బోయి భీమన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



వేడుకలో భాగంగా లో గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లుని 'బోయి భీమన్న అవార్డు-2026'తో పురస్కరించారు. ఆయనకు జ్ఞాపిక, శాలువాతో పాటు రూ. 2,00,000 నగదు పారితోషికం చెక్కును మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 'మహాకవి బోయి భీమన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన రచనల ద్వారా అమరుడయ్యారు, ప్రాతఃస్మరణీయుడిగా నిలిచారు. ఆయన కవితాధోరణికి, ఉదాత్త భావజాలానికి నిజమైన అర్థాంగి, సర్వస్వం ఆయన సతీమణి హైమావతి. భీమన్న రచనలు సమాజంలో ఎంతో స్ఫూర్తిను, చైతన్యాన్ని రగిలించాయి.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి పూర్తిగా కట్టుబడి ఉంది. నేటి తరానికి మహామహుల రచనలను అందించి సామాజిక వికాసానికి దోహదపడతాం. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి, ప్రస్తుతం తెలంగాణలో ఉన్న భీమన్న కళాపీఠాన్ని ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో ఉన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకుంటాం. సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎస్ ఎస్ రావత్ తో మాట్లాడి అర్హులైన ప్రతి కళాకారునికి గుర్తింపు కార్డులు ఇప్పిస్తాం అన్నారు.. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ పనితీరును శ్రీకృష్ణదేవరాయల భువనవిజయంలోని అష్టదిగ్గజాలతో పోల్చవచ్చని మంత్రి దుర్గేష్ చమత్కరించారు.

బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి మాట్లాడుతూ.. భీమన్న జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి దుర్గేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ ప్రసంగ శైలిని, వాగ్ధాటిని ఈ సందర్భంగా ఆమె ప్రశంసించారు.

రాష్ట్ర నాటక రంగ అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. బోయి భీమన్న గొప్ప సామాజిక రచయిత అని, సమాజ శ్రేయస్సు కోరిన ఆయన సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదివి అవగాహన చేసుకోవాలని సూచించారు.

**అవార్డు గ్రహీత భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..**

విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా, బోయి భీమన్నలను త్రిమూర్తులుగా, మహాకవులుగా కీర్తించారు. ఈ ముగ్గురూ పద్మ పురస్కారాలు పొందారని గుర్తుచేశారు. కవితా ప్రపంచాన్ని ఏలిన భీమన్న పేరిట తనకు అవార్డు రావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. భీమన్న సతీమణి హైమావతి కృషి వల్లే ఆయనకు ఈ గౌరవం ప్రతీ ఏటా దక్కుతోందని పేర్కొన్నారు.

# ప్రపంచానికి నీటి గండం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రతరం చేయనుందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా భవిష్యత్తులో ప్రజల జీవనోపాధి, ఆరోగ్యం, ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలో పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం ముందు భారీ నీటి సంక్షోభం ముప్పు పొంచి ఉందని, ఇదంతా మానవాళి మనుగడకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని హెచ్చరించింది. ఐదేళ్ల పాటు పరిశోధన చేసిన స్టేట్ ఆఫ్ గ్లోబల్ వాటర్ రిసోర్సెస్ రిపోర్టులో డబ్ల్యూఎంవో ఈ కీలక విషయాలు వెల్లడించింది. గత ఐదేళ్లలో సంభవించిన నీటి సంబంధిత విపత్తుల్లో (వరదలు, కరవులు) సగానికిపైగా ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోనే ఉన్నాయని డబ్ల్యూఎంఓ స్పష్టం చేసింది. ఈ రిపోర్ట్ ప్రకారం, నీటి విపత్తుల వల్ల సంభవించిన మరణాల్లో 80 శాతానికిపైగా ఈ రెండు ఖండాల్లోనే నమోదవడం గమనార్హం. కొన్ని చోట్ల ఒక విపత్తు నుంచి కోలుకోక ముందే మరో తీవ్ర ఘటన సంభవించిందని పేర్కొంది. డబ్ల్యూఎంఓ నివేదిక ప్రకారం, భూమిపై ఉన్నటువంటి అన్ని ప్రధాన గ్లేసియర్ ప్రాంతాలు మంచును కోల్పోతుండటం ఇది వరుసగా నాలుగో ఏడాది. 2023-25 మధ్య కాలంలో చూస్తే గ్లేసియర్లు ఏకంగా 1400 గిగాటన్నుల మంచును కోల్పోయాయి. ఈ నీరు ఎంత ఎక్కువ అంటే దీనితో సుమారు 56 కోట్ల ఒలింపిక్ పరిమాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్స్ను నింపొచ్చు. ఇంకా సమస్త మానవాళి ఏడాది పొడవునా ఉపయోగించే మంచినీటిలో సుమారు మూడోవంతుకు సమానం. 2025లో ప్రపంచవ్యాప్తంగా మూడింట రెండింతల బావుల్లో భూగర్భ జలాలు చారిత్రక సగటు కంటే కూడా దారుణంగా పడిపోయాయి. భూమిపై నీటి నిల్వల్లో భూగర్భ జలాల పాత్ర కీలకం. కానీ భారత్, ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలోని పలు ప్రాంతాల్లో ఈ భూగర్భ జలాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. 2022-25 మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో తరచుగా భూగర్భ జలాల లోటు నమోదైంది.

**ఇంకా 2025 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా నదుల్లో నీటి ప్రవాహం**

గణనీయంగా తగ్గిపోయింది. అంటే నదుల్లో నీటి మట్టాలు కూడా వేగంగా పడిపోతున్నాయని, గత 35 ఏళ్లలో చూస్తే అత్యల్ప నీటి ప్రవాహం నమోదైన సంవత్సరాల్లో ఇదొకటిగా నిలిచిందని డబ్ల్యూఎంవో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అమెజాన్, జాంబేజీ, నైలు వంటి ప్రధాన నదీ పరివాహక ప్రాంతాల్లోనూ నీటి ప్రవాహాలు పెద్ద మొత్తంలో పడిపోవడం మరింత ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. ప్రపంచ దేశాలు సహకరించుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రపంచ వాతావరణ సంస్థ చెప్పుకొచ్చింది.

# మేమిద్దరం మంచి దోస్తులం

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు.

''జిన్పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది'' అని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాగా ఈ నెలాఖరులో చైనా అధ్యక్షుడు జిన్పింగ్.. సతీమణి పెంగ్ లియువాన్తో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ట్రంప్ ఎయిర్పోర్టుకు వెళ్లి మరీ ఆయనను స్వాగతించనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ డీసీకి సమీపంలోని సైనికస్థావరంలో ఉన్న ఎయిర్పోర్టుకు వెళ్లి జిన్పింగ్ దంపతులను అధ్యక్షుడు స్వాగతించే అవకాశం ఉందని వైట్హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నేతలతో ప్రముఖ టెక్ దిగ్గజాలు ఎలాన్ మస్క్, సుందర్ పిచాయ్, టిమ్ కుక్, మైఖేల్ డెల్, జెఫ్ బెజోస్, జెన్సన్ హువాంగ్, శామ్ ఆల్ట్మన్, జేన్ ఫ్రేజర్ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ భేటీలో కృత్రిమ మేధపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

# సినీ ప్రముఖుల 'పేర్లు'

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్'లో చేసిన సూచనకు పలువురు సినీ ప్రముఖులు స్పందించి వరంగల్ ఎయిర్పోర్టుకు పేర్లు సూచించారు. దర్శకులు సందీప్ రెడ్డి వంగా తన సొంతూరుకు విమానాశ్రయం రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు తాను అనుకుంటున్న పేర్లను ఎక్స్ వేదికగా ప్రకటించారు. 'రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్.

విమానాశ్రయానికి వరంగల్ ఘనమైన వారసత్వాన్ని, సాంస్కృతిక స్ఫూర్తిని ప్రతిబింబించే పేరును పెట్టడం నిజంగా ఎంతో అర్థవంతంగా ఉంటుంది. ఇందుకు కృషి చేసి, విమానాశ్రయం కలను వాస్తవంలోకి తెచ్చిన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిగారికి ధన్యవాదాలు'' 'దసరా', 'ది ప్యారడైజ్' చిత్రాల దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఆనందం వ్యక్తం చేశారు. వరంగల్ మ్యాప్లో ఒక ప్రాంతం మాత్రమే కాదని, లక్షలాది ప్రజల భావోద్వేగమన్నారు. చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికతకు ఆలవాలమన్నారు.

# చిట్టి రోబో మనిషిని మింగేస్తుందా?

(మొదటి పేజీ తరువాయి)

విస్తరిస్తున్న ఒక భయానక వాస్తవం! సాంకేతిక విప్లవం పేరుతో మానవాళి తన స్వంత మేధస్సుతో తనకు తానే ఉరితాడు బిగించుకుంటోందా? అంటే... అవుననే సమాధానం ఇస్తున్నాయి ఇటీవల కాలంలో తలెత్తుతున్న పరిణామాలు. అణుబాంబు ఎంతటి విధ్వంసకరమో, దానిని సృష్టించిన శాస్త్రవేత్తలందరూ తర్వాత ఎంతగా పశ్చాత్తాప పడ్డారో చరిత్ర చెబుతోంది. సరిగ్గా అదే కోవలోకి ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వచ్చి చేరుతోంది. విజ్ఞాన వికాసానికి ప్రతీకగా నిలవాల్సిన కృత్రిమ మేధ, రేపు మానవ జాతి సర్వనాశనానికే తొలి మెట్టు కాబోతోందా? ఈ ప్రశ్న నేడు ప్రపంచ దేశాలను, మేధావులను నిద్రపోనివ్వడం లేదు.

ఒకప్పుడు మనిషి తన మేధస్సుతో యంత్రాలను తయారు చేశాడు. తన పనులను సులువు చేసుకునేందుకు, శ్రమను తగ్గించుకునేందుకు వాటికి రూపమిచ్చాడు. కానీ, నేడు పరిస్థితి తలకిందులైంది. ఏఐ కేవలం ఒక పనిముట్టుగా మిగలలేదు సరికదా దాని సృష్టికర్త అయిన మనిషినే శాసించే స్థాయికి ఎదుగుతోంది. అల్గారిథమ్ల రూపంలో ఇది అల్లుకుంటున్న మాయాజాలం మనిషి ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను క్రమక్రమంగా హరిస్తోంది. ఉద్యోగాలు కరిగిపోవడం, ఉపాధి అవకాశాలు ఆవిరైపోవడం దీనివల్ల జరిగే ఆర్థిక నష్టమైతే.. మానవ సంబంధాలు, నిజానిజాల మధ్య వ్యత్యాసం చెరిగిపోవడం దీనివల్ల జరుగుతున్న సామాజిక వినాశనం. డీప్ఫేక్ వీడియోలు, తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్), అబద్ధాలను నిజాలుగా నమ్మించే కృత్రిమ సత్యాలు సమాజంలో అరాచకానికి బీజం వేస్తున్నాయి. ఎవరు నిజమో, ఏది కల్పితమో తెలియని అయోమయ స్థితిలోకి మానవాళి నెట్టబడుతోంది.

ముఖ్యంగా, ఏఐ వేగాన్ని నియంత్రించే విచక్షణాయుతమైన కళ్లెం ప్రస్తుతం ఎవరి చేతుల్లోనూ లేదు. కార్పొరేట్ దిగ్గజాల లాభాపేక్ష, దేశాల మధ్య ఆధిపత్య పోరు ఏఐ ని ఒక వినాశకర ఆయుధంగా మారుస్తున్నాయి. రేపు స్వయంప్రతిపత్తి కలిగిన ఏఐ యంత్రాలు (అటానమస్ సిస్టమ్స్) లేదా మనుషులను మించిన మేధస్సు (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్) కనుక మానవ నియంత్రణను దాటితే... అది కేవలం ఒక వ్యవస్థ పతనం కాదు, యావత్ మానవ జాతి అంతం అవుతుందనే నిపుణుల హెచ్చరికలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. లోగడ స్టీఫెన్ హాకింగ్, ఎలన్ మస్క్ వంటి దిగ్గజాలు ముందే హెచ్చరించినట్లుగా, ఏఐని సరిగ్గా నియంత్రించలేకపోతే మానవాళి ఎదుర్కొనే చివరి ఆవిష్కరణ ఇదే కావచ్చు.సాంకేతికత మనిషి చెప్పు చేతుల్లో ఉండాలి తప్ప, మనిషి సాంకేతికతకు బందీ కాకూడదు. ఏఐ అభివృద్ధిని పూర్తిగా నిషేధించడం అసాధ్యం, అలా చేయడం కూడాసరికాదు. కానీ, దానికి కఠినమైన నైతిక సరిహద్దులను (ఎథికల్ బౌండరీస్) గీయాల్సిన తక్షణ కర్తవ్యం నేడు ప్రపంచ దేశాలపై ఉంది. లాభాల వేటలో పడిమానవాళి మనుగడనే పణంగా పెట్టే ప్రమాదకర ప్రయోగాలను అంతర్జాతీయ వేదికలపై కట్టడి చేయాలి.ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ విషయంలో అంతర్జాతీయంగా కఠినమైన నిబంధనలు తీసుకురాకపోతే భవిష్యత్తులో మానవాళి తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించాల్సి వస్తోంది. ఈ ముప్పును నివారించడానికి ప్రపంచ దేశాలు,అంతర్జాతీయ సంస్థలు సమిష్టిగా బలమైన చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యం. అణు ఇంధన నియంత్రణ కోసం 'ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ' (ఐఏఈఏ) తరహాలో, ఏఐ పరిశోధనలను పర్యవేక్షించడానికి ఒక స్వయంప్రతిపత్తి కలిగిన అంతర్జాతీయ నియంత్రణ మండలిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచన. ఏఐ టూల్స్ తయారీలో అల్గారిథమ్లన పారదర్శకతను తప్పనిసరి చేయడంతో పాటు, డీప్ఫేక్స్ , తప్పుడు సమాచార సృష్టిని తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ కఠినమైన శిక్షాస్మృతులను అమలు చేయాలి.మానవ నియంత్రణను దాటేసే 'అటానమస్' వ్యవస్థల అభివృద్ధి, సైనిక రంగంలో ఏఐ ఆయుధాల వినియోగంపై ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (ఏజీఐ) పరిమితులతో స్పష్టమైన ఒప్పందాలు, నిషేధాలు ఉండాలి. కేవలం వ్యాపార లాభాల కోసం భద్రతా ప్రమాణాలను విస్మరించే టెక్ దిగ్గజాలపై కార్పొరేట్ జవాబుదారీతనం కింద భారీ జరిమానాలు ,చట్టపరమైన చర్యలు ఉండేలా కఠినమైన నిబంధనలు రూపొందించాలి.

# 3 కంపెనీలను హ్యాక్ చేసిన జెమినై ఏఐ

**హైదరాబాద్, సెప్టెంబర్ 19:** అత్యాధునిక ఏఐ మోడళ్లతో సైబర్ భద్రతకు సవాళ్లు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఓపెన్ఏఐకి చెందిన కృత్రిమ మేధ ఏజెంట్ సైబర్ దాడికి పాల్పడినట్లు తెలిసింది. తాజాగా గూగుల్కు చెందిన మోడల్ 'జెమినై ఏఐ' కూడా 3 కంపెనీలను హ్యాక్ చేసింది. ఈ విషయాన్ని గూగుల్ ధ్రువీకరించింది. అఐ ఏజెంట్ల దాడి సామర్థ్యాలను అంచనా వేయడానికి ఈ సంస్థ ఇటీవల సైబర్ సెక్యూరిటీ వ్యవస్థను రూపొందించింది. దానిని పరీక్షిస్తున్న సమయంలో జెమినై తన నిర్దేశిత పరిధులను దాటి.. మూడు ఇతర కంపెనీలకు చెందిన డిజిటల్ సమాచారాన్ని హ్యాక్ చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే తమ ఏఐ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ పనిచేయడం దానంతట అదే ఆగిపోయిందని తెలిపింది. 'సైబర్ సెక్యూరిటీ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఇతర పాస్ వర్డులను ఊహించి జెమినై ఏఐ బహిరంగ వెబ్ నుంచి మరో మూడు కంపెనీల డిజిటల్ ప్లాట్ఫామ్లలోకి అనధికారికంగా ప్రవేశించింది.

# గరుడునిపై గోవిందుడి విహారం..!

## ఆరు గంటలపాటు వైభవంగా గరుడోత్సవం

## గోవింద నామస్మరణతో మారుమోగిన తుమ్మలగుంట

## 75 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు అంచనా

## మోహినీ అవతారంలో పల్లకీపై విష్ణుమూర్తి అభయహస్తం



**తిరుపతి రూరల్ సెప్టెంబరు19 మనం న్యూస్:** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన గరుడవాహన సేవ శనివారం రాత్రి అశేష భక్తజనుల మధ్య వైభవంగా జరిగింది. శ్రీవారికి అత్యంత ప్రీతికరమైన గరుడ వాహనంపై మలయప్పస్వామి విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి గరుడవాహన సేవను తిలకించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో తుమ్మలగుంట వీధులన్నీ జనసంద్రంగా మారాయి. గరుడునిపై గోవిందుడు విహరిస్తుండగా భక్తులు గోవింద నామస్మరణతో పరవశించారు. సుమారు ఆరు గంటల పాటు సాగిన గరుడోత్సవం ముగిసే సమయానికి సుమారు 75 వేల మందికిపైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు సమాచారం. భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను కఠినంగా అమలు చేశారు. భక్తులందరికీ సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం విష్ణుమూర్తి మోహినీ అవతారంలో పల్లకీపై ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఉత్సవంలో స్వామివారు భక్తులకు అభయహస్తంతో ఆశీస్సులు అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

### గరుడవాహనానికి నూతన గొడుగులు, శేషవస్త్రం

గరుడవాహన సేవకు తుమ్మలగుంటకు చెందిన చెంచురెడ్డి నూతన గొడుగులు, శేషవస్త్రాన్ని స్వామి వారికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్రెడ్డి ఆ ఇంటికి వెళ్లి నూతన గొడుగులు, వస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వాటిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. గొడుగుల ఊరేగింపులో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### సారె సమర్పణ

పల్లకీ ఉత్సవంకు తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం, కేసీపేట, చిగురువాడ, మల్లంగుంట, సి.గొల్లపల్లి, దుర్గసముద్రం, పైడిపల్లి, పాతకాల్వ, రామానుజపల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున సారె తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. అనంతరం పల్లకీ ఉత్సవంలో పాల్గొన్నారు. గరుడవాహన సేవకు పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, పుదిపట్ల, చెర్లోపల్లి గ్రామాలతో పాటు చంద్రగిరి మండలం తొండవాడ, మిట్టపాళెం, దోర్నకంబాల, పిచ్చినాయుడుపల్లి, బుచ్చినాయుడుపల్లి, శానంబట్ల, గంగుడుపల్లి గ్రామాలకు చెందిన భక్తులు సారె తీసుకువచ్చి సమర్పించారు. సారెతో వచ్చిన భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్రెడ్డిలు ఆత్మీయ స్వాగతం పలికారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గరుడవాహన సేవను పురస్కరించుకుని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కోలాటాలు, చెక్కభజనలు, పిళ్లనగ్రోవులు, కేరళ వాయిద్యాలతో పాటు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి. దేవతామూర్తుల కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గరుడవాహన సేవకు ముందు కళాకారులు ప్రదర్శించిన వివిధ కళారూపాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

# మోహినీ అవతార సేవలో అలరించిన 8 రాష్ట్రాల కళారూపాలు

## 18 కళారూపాలతో 502 మంది కళాకారుల అపూర్వ ప్రదర్శనలు

## భక్తులను మంత్రముగ్ధులను చేసిన జానపద, శాస్త్రీయ నృత్యాలు



**తిరుమల, సెప్టెంబర్ 19 మనం న్యూస్:** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉదయం జరిగిన మోహినీ అవతార సేవలో భారతీయ కళా వైభవం వెల్లివిరిసింది. ఎనిమిది రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన జానపద, శాస్త్రీయ కళారూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, కేరళ, పంజాబ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన కళాబృందాలతోపాటు టీటీడీకి చెందిన వివిధ కళా ప్రాజెక్టులు, సంస్థల కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం 18 కళాబృందాలకు చెందిన 502 మంది కళాకారులు 18 కళారూపాలను ప్రదర్శించారు. భరతనాట్యం, కూచిపూడి, సత్రియ, ఒడిస్సీ, భాంగ్రా, కోలాటం, పేరిణి శివతాండవం, మయూర నృత్యం, డమరుక ధ్వని విన్యాసం, అన్నమయ్య జానపదాలు తదితర ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

మహారాష్ట్రకు చెందిన కథేకర్ బృందం గూమర్, పెద్దతాళాలతో జెంజ్ నృత్యం, మధ్యప్రదేశ్కు చెందిన మయాంక్ తివారి బృందం బడాయి నృత్యం, కేరళకు చెందిన కె. రచన బృందం తిరువట్టన్ రూపకం, అస్సాంకు చెందిన సబిత సైకియా బృందం సత్రియ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల కళాకారులు మోహినీ అవతార సన్నివేశం, భరతనాట్యం, పేరిణి శివతాండవం తదితర ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. దాస సాహిత్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టులకు చెందిన కళాబృందాలు కూడా భక్తిరసభరిత కళా ప్రదర్శనలు అందించాయి.

### నాలుగు ఉత్తమ కళాబృందాలకు ఈవో సన్మానం

వాహనసేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాలుగు కళాబృందాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శాలువాతో సత్కరించారు.

దాస సాహిత్య ప్రాజెక్టు: ఎం. గౌరవి రెడ్డి బృందం - సప్తగిరి వైభవం, హైదరాబాద్, తెలంగాణ - 28 మంది.

హిందూ ధర్మ ప్రచార పరిషత్తు: శ్రీ కథేకర్ బృందం - పండర్పూర్ వార్కరీ గర్భ నృత్యం, మహారాష్ట్ర - 60 మంది.

శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల: శ్రీ ఎన్. శివకుమార్ బృందం - భరతనాట్యం, తిరుపతి, ఆంధ్రప్రదేశ్ - 23 మంది.

అన్నమాచార్య ప్రాజెక్టు: శ్రీ హర్దీప్ సింగ్ బృందం - భాంగ్రా, పంజాబ్ - 15 మంది.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నిర్వహిస్తున్న ఈ కళా ప్రదర్శనలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందంతోపాటు భారతీయ శాస్త్రీయ, జానపద కళల వైభవాన్ని పరిచయం చేస్తున్నాయి.

# వినాయక నిమజ్జనానికి పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు: సీఐ బి. తిరుపతిరావు



**కిర్లంపూడి, సెప్టెంబర్ 19(మనం న్యూస్):** వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు పటిష్ఠ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు శనివారం మండలంలోని పాలెం, భూపాలపట్నం గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించే ప్రధాన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ఎస్సై జి. సతీష్కుమార్తో కలిసి నిమజ్జన ఘాట్ల వద్ద చేపట్టాల్సిన బందోబస్తు, రక్షణ ఏర్పాట్లపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నిమజ్జనానికి తరలివచ్చే భక్తులు, యువతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నీటి లోతు ఎక్కువగా ఉండి ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారమున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం వద్ద అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, పోలీసు యంత్రాంగం చేసే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలు, ప్రజలు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. నిమజ్జన ప్రదేశాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరంరెడ్డి కాశిబాబు, నీలం శ్రీనుతో పాటు పలువురు పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాధ్యం



- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- తిరుపతిని పరిశుభ్ర, సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలి: కమిషనర్ జయకృష్ణ

**తిరుపతి, సెప్టెంబర్ 19 మనం న్యూస్:** స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. పరిశుభ్రత అనేది కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం తిరుపతి ఎన్జీవో కాలనీలోని మాల్వాడిగుండం కాలువ వద్ద నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి కాలువను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, స్వచ్ఛత ఉన్న చోటే ఆరోగ్యం, ఆరోగ్యం ఉన్న చోటే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి, నగర అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువ నాయకులు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యంగా నిర్దేశించుకున్న స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, అదే విధంగా మన వీధి, కాలనీ, నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాల పరిశుభ్రతను కాపాడాలని, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చదనం పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు.

# మంచి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

## పీఎంఏవై 2.0 ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



**చిత్తూరు సెప్టెంబరు 19మనం న్యూస్:** ప్రజల కోసం మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థాగత ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నిలవాలని చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కోరారు. ప్రజా బాంధవుడిగా.., ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని వారు విన్నవించారు.శనివారం చిత్తూరు ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ లో చిత్తూరు అర్బన్ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 ద్వారా మంజూరైన ఇళ్ల మంజూరు పత్రాలను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజలకు అభివృద్ధిని, సంక్షేమాన్ని, మౌలిక సదుపాయాలను అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం జిల్లా కేంద్రమైన చిత్తూరులో అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. గత ఏడాది పీఎంఏవై కింద వెయ్యికి పైగా అర్హులను గుర్తించిన ప్రభుత్వం, ప్రస్తుతం ఇల్లు మంజూరైన 309 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పత్రాల పొందిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.1.0 లక్ష చొప్పున మొత్తం రూ.2.5 లక్షలను రూపాయలను అందించి, వారి ఇంటికలను సహకారం చేయనుందని తెలియజేశారు. స్థానికంగా ఉన్న కూటమి నాయకులు, అర్హులైన ఇతరులను గుర్తించి, వారికి ఇల్లు మంజూరు అయ్యేలా జాబితా సిద్ధం చేయాలనీ అధికారుల ఆదేశించారు. ప్రస్తుతం ఇల్లు మంజూరైన వారు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇల్లు నిర్మించుకునేలా అధికారులు వారికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, తెదేపా చిత్తూరు పరిశీలకులు కుమారి, కూటమి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, రాజేష్ కుమార్ రెడ్డి, నళిని, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ ఇన్చార్జులు, తెదేపా, భాజపా నాయకులు పాల్గొన్నారు.

# గ్యాలరీల్లో ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ ఈవో

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట యంత్రాంగం ఏర్పాటు చేయాలని ఆదేశం



**తిరుమల సెప్టెంబరు 19మనం న్యూస్:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే గరుడసేవను పురస్కరించుకుని గ్యాలరీల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శనివారం ఉదయం పరిశీలించారు.

శ్రీవారి ఆలయం నుంచి గ్యాలరీలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన ఈవో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖల వారీగా పటిష్టమైన సమన్వయ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా వైద్యం, అన్నప్రసాదాలు, పోలీసు, పారిశుధ్యం, విజిలెన్స్, శ్రీవారి సేవ, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, అత్యవసర వైద్య సేవలు తదితర విభాగాల అధికారులు గ్యాలరీల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భక్తుల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడంతో పాటు, అవసరమైన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తక్షణమే తీసుకురావాలని ఆదేశించారు.అనంతరం గ్యాలరీల్లోని భక్తులతో ఈవో స్వయంగా మాట్లాడి అన్నప్రసాదాలు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, శ్రీవారి సేవకుల సేవలు, టీటీడీ సిబ్బంది అందిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అందిస్తున్న శుద్ధి చేసిన జలప్రసాదాన్ని పరిశీలించారు. తమిళనాడు, మహారాష్ట్ర, హైదరాబాద్, అనంతపురం, నాందేడ్, కేరళ, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలు, భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# గరుడసేవ ఏర్పాట్లను పరిశీలించిన టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు

- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో సేవలు అందించాలని సూచన



**తిరుమల సెప్టెంబరు 19మనం న్యూస్:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా జరిగే గరుడవాహన సేవను పురస్కరించుకుని టీటీడీ చేపట్టిన ఏర్పాట్లను చైర్మన్ బి.ఆర్. నాయుడు శనివారం పరిశీలించారు.టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో డా. ఎ. శరత్, సీవీఎస్వో కె.వి. మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు, బోర్డు సభ్యులు, ఇతర అధికారులతో కలిసి శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీలను చైర్మన్ పరిశీలించారు.గరుడసేవను దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు కల్పిస్తున్న అన్నప్రసాదం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించి, భక్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. టీటీడీ ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టి, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

గరుడవాహన సేవను దర్శించేందుకు తరలివచ్చిన భక్తులతో మాడవీధుల్లోని గ్యాలరీలు నిండిపోవడంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు, సిబ్బంది నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

# స్టాంపులు మన వారసత్వ సంపద




## అపోలోలో ఘనంగా ఫిలాటెలియా-2026

**చిత్తూరు, సెప్టెంబర్ 19(మనంన్యూస్):** ది అపోలో యూనివర్సిటీ ఫిలాటెలీ క్లబ్ ఆధ్వర్యంలో ఫిలాటెలియా-2026 కార్యక్రమం శనివారం డా. ప్రతాప్ సి రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పోస్టల్ స్టాంపులపై అవగాహన పెంపుతో పాటు భారతదేశ చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని పరిచయం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) నితిన్ ఎం. నాగర్కర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి స్టాంపులో ఒక చరిత్ర దాగి ఉంటుందని, పోస్టల్ స్టాంపులు ఆ దేశ చరిత్రను ప్రతిబింబించే ముఖ్య వనరులని పేర్కొన్నారు. వాటి ద్వారా విద్యార్థులు దేశ వారసత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవచ్చన్నారు.

ప్రొఫెసర్ ఎమెరిటస్, అపోలో నాలెడ్జ్ సిటీ బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యుడు, స్ట్రాటజిక్ అడ్వైజర్ డా. హెచ్. వినోద్ భట్ ప్రత్యేక ఆహ్వానితునిగా పాల్గొని ఫిలాటెలీ విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచనను పెంపొందిస్తుందని అన్నారు. ప్రపంచంలోని కొన్ని దేశాల్లో పోస్టల్ వ్యవస్థ ప్రాధాన్యం తగ్గుతున్నప్పటికీ, స్టాంపులు మన మహోన్నత వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఆసక్తి, అభిరుచి ఉంటే స్టాంపుల సేకరణ ఉత్తమ హాబీగా నిలుస్తుందని, ఇది ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తుందని తెలిపారు. ప్రొ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డా.) అల్ఫ్రెడ్ జె. ఆగస్టిన్, ఎఐఎంఎస్ఆర్ డీన్ డా. రమ్య రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ డీన్ డా. రామయ్య ఇటుమల్ల అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల కోసం రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ది స్టాంప్ డిటెక్టివ్స్ పేరిట ఫిలాటెలిక్ క్విజ్ పోటీలో విద్యార్థులు జట్లుగా పాల్గొని పలు రౌండ్లలో తమ ప్రతిభను చాటుకున్నారు. అలాగే ఇండియా వర్త్ రిమెంబరింగ్ విభాగంలో విద్యార్థులు భారతదేశంలో గుర్తింపు పొందని అంశాలపై స్మారక పోస్టల్ స్టాంపుల రూపకల్పనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పరిశోధన, ప్రెజెంటేషన్ నైపుణ్యాలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. పోటీల్లో విజేతలు, రన్నరప్లకు ఆకర్షణీయమైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయానికి చెందిన అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సత్యదేవుని సన్నిధిలో కాకినాడ కలెక్టర్ హరేంద్ర ప్రసాద్

- భక్తిశ్రద్ధలతో స్వామివారి దర్శనం-ఆలయ అధికారులు ఘన స్వాగతం



**అన్నవరం, సెప్టెంబర్ 19, మనం న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ సతీ సమేతంగా శనివారం ఉదయం విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు కలెక్టర్ హరేంద్ర ప్రసాద్కు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు. దేవస్థానం తరఫున స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అనంతరం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దర్శన ఏర్పాట్లు, ఆలయ నిర్వహణ, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా దేవస్థానం చేపడుతున్న చర్యలను అధికారులు వివరించారు. కలెక్టర్ స్వామివారి దర్శనానికి విచ్చేసిన సందర్భంగా దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబు రావు, సహాయ కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెక్కిరిస్తున్న వైఫల్యాలు

పరిమితులు లేని
ప్రజాస్వామ్య దేశంలో
పాలకుల ఎత్తుగడలు
పారుతున్నాయి
పాలకుల వైఫల్యాలు ప్రతి
ఫలం ఇవ్వకపోగ అవమానాల
పాలుచేసి వెక్కిరిస్తున్నాయి
నీడ నివ్వలేని ప్రజల
నివాసలు నేల మట్టమవుతున్నాయి
బయట పడని బినామీలను ప్రశ్నించలేక
అవి నోర్లు తెరవడం మానుకొన్నాయి
నడివీధిలో నిలబడి రచ్చకెక్కి
వీధి రౌడీల్లా వ్యవహారిస్తున్నాయి
ప్రశ్నించే గొంతుల మీద ఉక్కు పాదం
మోపి నొక్కబడుతున్నాయి
ఎన్నికల బరిలో బలవంతపు ఒత్తిళ్లకు
గురిచేసి గెలుస్తున్నాయి
నీతి లేని నాయకుల
చేత ప్రజా ప్రభుత్వాలు
నడపబడుతున్నాయి
రాబడుల రాసుల కోసం సరికొత్త
మార్గాలను అన్వేషిస్తున్నాయి
రాయతీలు ఇవ్వకపోగ నడ్డివిరిచే
పన్నులను విధిస్తున్నాయి
పనికి మాలిన పథకాల పేర్లతో ప్రజల
సొమ్ముకు తూట్లు పొడుస్తున్నాయి
కనీస అవసరాలు తీర్చలేక కాకమ్మ
కబుర్లతో కాలక్షేపం చేస్తున్నాయి
అందుకే... మనం మోసపోక ముందే
మొద్దు నిద్రను వీడాలి
మంచి మార్గాన్ని ఎన్నుకొని
పోటు బెట్టి ఓడించి గెలవాలి!!

**- ఎస్. జవేరియా**
9849931255

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు
ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

# నిగ్గు తేల్చుతారా... నీరుగారుస్తారా?



శాసనసభ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారవించిన ప్రసంగం ఒక తీవ్రమైన రాజకీయ రణభేరిని తలపించింది. గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పేరిట వేలాది ఎకరాల నేలను బొక్కేసిన భూ రాబందుల ముసుగులను చీల్చి చెండాడతామని, పూర్వపు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారి ఫామ్‌హౌస్‌లోని ఏడు వందల ఎకరాలలో మూడు వందల ఎకరాలు ప్రభుత్వానికి చెందిన ఆక్రమిత భూమేనని, దాన్ని వెలికితీసి స్వాధీనం చేసుకుంటామని ఆయన చేసిన ఉద్ఘాటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ అక్రమాల తీరుతెన్నులను విప్పి చెప్పేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడం పైకి ఎంతటి వీరోచితమైన అడుగుగా కనిపిస్తున్నప్పటికీ, లోతుగా పరిశీలిస్తే అనేక అనుమానాలు, విమర్శలు, రాజకీయ శంకలు వ్యక్తమవుతున్నాయి. పదేళ్ల భూ దోపిడీపై పోరాటం ప్రకటిస్తున్నామని చెప్తున్న ఈప్రభుత్వం, నిజంగానే ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతుందా? లేక గత పాలకుల తరహాలోనే కేవలం విమర్శల విన్యాసాలతో సమయాన్ని వృథా చేస్తూ ప్రజల కళ్లల్లో దుమ్ము కొడుతుందా?

అధికారంలో ఉన్న పాలకులకు సభ వేదికగా ఆవేశపూరిత ఉపన్యాసాలు దంచడం కొత్తేమీ కాదు. తెలంగాణ రాష్ట్రం అవతరించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు రెండున్నర కోట్ల ఎకరాల భూముల వివరాలను, ప్రజల సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టి దోచిపెట్టారని సభలో ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రజల ఆస్తులు పరుల పాలయ్యాయని సత్యదూరం కాని నిజాన్ని బిగ్గరగా చెప్పారు. అయితే, ఇక్కడ ప్రశ్న ఏమిటంటే.. అధికార పీఠంపై కూర్చొని తొమ్మిది నెలల కాలం గడుస్తున్నా, ఆ భూ బకాసురుల పేర్లను అధికారికంగా ఎందుకు బయటపెట్టలేక పోతున్నారు? కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లో మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న తీవ్రమైన ఆరోపణ వార్తా పత్రికలలో సంచలనంగా మారడానికి బాగానే ఉపయోగపడుతుంది. కానీ, ప్రభుత్వ వద్ద తగిన ఆధారాలు, భూముల చిట్టా స్పష్టంగా ఉన్నప్పుడు క్షణం ఆలస్యం చేయకుండా చట్టపరమైన నోటీసులు ఇచ్చి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి




ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అధికారిక మైకుల ముందు బాంబులు పేల్చడం రాజకీయ ప్రయోజనానికి తప్ప, పక్కా చట్టబద్ధమైన చర్యలు లేనప్పుడు ఇవన్నీ కేవలం నాటకాలుగానే మిగిలిపోతాయి.

ఏ ప్రభుత్వం వచ్చినా ఏదైనా పెద్ద సంచలనాత్మక విషయం ఎదురైనప్పుడు ముందుకు తెచ్చే ఏకైక అస్త్రం 'ప్రత్యేక విచారణ బృందం'. కానీ చరిత్రను ఒకసారి తిరగేస్తే, విచారణ బృందం అంటే నిజాయితీతో కూడిన విచారణ కాదు, సమస్యను మరుగున పడేసే నిదాన ప్రక్రియ అని ప్రజలకు తేటతెల్లమైపోయింది. గతంలో జరిగిన అనేక భారీ కుంభకోణాలపై వేసిన విచారణ బృందాల నివేదికలు ఏమయ్యాయో, వాటి ఫలితాలు ఏ మూలన పడ్డాయో అందరికీ తెలిసిన విషయమే. రాజకీయనాయకులు పరస్పరం బురద చల్లుకోవడం పూర్తి కాగానే, వాతావరణం చల్లారిన తర్వాత ఆ దస్త్రాలు ప్రభుత్వ కార్యాలయాల అటకపై దుమ్ము పట్టిపోవడం పరిపాటిగా మారింది. ధరణి అక్రమాలపై వేసే విచారణ బృందం కూడా కేవలం గత పాలకులపై ఒత్తిడి పెంచడానికి, రాబోయే ఎన్నికలలో లబ్ధి పొందడానికి వాడుకునే ఒక రాజకీయాస్త్రంగా మారదా అని సామాన్యుడు ప్రశ్నిస్తున్నాడు. నిజంగానే ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, ఒక నిర్దిష్టమైన గడువు విధించి ఆ నివేదికను ప్రజల ముందు ఎందుకు ఉంచకూడదు?

శాసనసభ వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్న నాయకులకు క్షేత్రస్థాయిలో సామాన్య రైతు పడుతున్న అవస్థలు కనిపిస్తున్నాయా? ధరణి స్థానంలో 'భూ భారతి' చట్టాన్ని తెచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నా, నేటికీ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల చుట్టూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న రైతులకు ఏమాత్రం ఉపశమనం లభించలేదు. నిషేధిత భూముల జాబితా పరిధిని ముప్పై లక్షల ఎకరాల నుంచి మూడు లక్షల డెబ్బై మూడు వేల ఎకరాలకు తగ్గించామని ఘనంగా అంకెలు చెబుతున్నారు. కానీ, ఇప్పటికీ లక్షలాది మంది పేద రైతులు తమ భూములకు హక్కులు లేక, బ్యాంకుల నుంచి పంట రుణాలు అందక, కష్టకాలంలో భూములను అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిషేధిత జాబితాపై నిర్ణయాధికారాన్ని కేవలం కలెక్టర్లకే కట్టబెట్టడం ద్వారా రెవెన్యూ వ్యవస్థలో మళ్లీ పాతకాలపు అధికారం, లంచగొండితనం శృతిమించే ప్రమాదం ఉంది. ఒక రెవెన్యూ అధికారి దయాదాక్షిణ్యాలపై రైతు భవిష్యత్తు ఆధారపడేలా చేయడం ఏ రకమైన ప్రక్షాళన? అరవై రోజుల్లో విన్నపం, తొంబైరోజుల్లో పునఃపరిశీలన అంటూ కోర్టుల చుట్టూ, అధికారుల చుట్టూ తిప్పే ప్రతిపాదనలు సగటు పౌరుడికి కొత్త నరకాన్ని చూపిస్తున్నాయి.

తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుని అధికారాన్ని ఇచ్చింది కేవలం సభల్లో తిట్ల పురాణాలు, మునుపటి పాలకుల వైఫల్యాల వల్ల కలిగే వినోదం కోసం కాదు. నిరుపేదల భూములను అక్రమంగా కొల్లగొట్టిన వారు ఎంతటి ఘటనాఘటన సమర్థులైనా , పూర్వపు ముఖ్యమంత్రి అయినా, మంత్రులైనా చట్టం ముందు మోకరిల్లేలా చేయడమే ప్రజా ప్రభుత్వ బాధ్యత. ధరణి పేరుతో జరిగిన విదేశీ కంపెనీల దోపిడీపై నిజంగా నిజాయితీ ఉంటే, కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా న్యాయస్థానపు న్యాయమూర్తితో నిష్పాక్షిక విచారణ జరిపించాలి.

రాజకీయ కక్షసాధింపుల కోసం, ప్రత్యర్థులను భయపెట్టడానికి భూ సమస్యలను వాడుకోవడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఇకనైనా మైకుల ముందు మాటల యుద్ధాలు ఆపాలి. కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌లోని మూడు వందల ఎకరాల ప్రభుత్వ భూమితో సహా, రాష్ట్రంలో ఆక్రమణకు గురైన ప్రతీ ఒక ఎకరం భూమిని స్వాధీనం చేసుకుని, నిజమైన బాధితులకు తిరిగి అప్పగించినప్పుడే ఈ ప్రభుత్వ మాటలకు విలువ ఉంటుంది. లేదంటే, ఇది కూడా 'చేసేది శూన్యం.. చెప్పేది గంభీరం' అన్న చందంగానే మిగిలిపోతుంది!

**- వెంక గారి భూమయ్య**
9848559863

# స్థానిక సమస్యల పరిష్కారం... పంచాయితీ రాజ్ లక్ష్యం

భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లో ఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీన కాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనా వ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామవృత్తి పనివారల ప్రతినిధులతో పని చేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపు దిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్‌లో ప్రారంభమైంది. గ్రామస్థాయిలో గ్రామపంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతి సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పడింది. 1986లోబ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు.

కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీని 1956లో నియమించారు. ఈ కమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్యవికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి.

బల్వంతరాయ్ మెహతా స్వాతంత్ర్య సమర





యోధుడు, సామాజిక కార్యకర్త, పంచాయితీ రాజ్ నూతన వ్యవస్థ మార్గదర్శకుడు. ఆయన బర్డోలి సత్యాగ్రహ భాగస్వామి. గుజరాత్ రాష్ట్రానికి రెండవ ముఖ్యమంత్రిగా పనిచేశాడు. స్వయంపాలన కోసం ప్రజల పోరాటం ఆయన జీవితాశయం. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సంబంధంగా 'బల్వంతరాయ్ మెహతా కమిటీ' సిఫార్సులు దేశంలో అమలు పరచబడి, ప్రాచుర్యం పొందిన పంచాయితీ రాజ్ అనే విప్లవాత్మక కార్యక్రమంతో మెహతా గుర్తింపు పొందాడు.

స్వాతంత్ర్యం తరువాత మెహతా భారతదేశ లోక్‌సభకు పార్లమెంటు సభ్యునిగా రెండుసార్లు ఎన్నికయ్యాడు. పార్లమెంట్ అంచనా కమిటీ అధ్యక్షుడుగా ఉన్నాడు. ప్రణాళిక ప్రాజెక్ట్స్ కమిటీ అధ్యక్షుడుగా రాష్ట్రాలలో మూడు అంచెల వ్యవస్థ స్థాపన కోసం మెరుగైన విధానానికి అద్భుతమైన నివేదికను సిద్ధం చేశాడు. తద్వారా భారత దేశపు పంచాయితీ రాజ్ ఫాదర్‌గా ప్రశంసించ బడ్డాడు.

1952, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన సమాజ అభివృద్ధి కారక్రమం ప్రాతి పదికగా, జాతీయాభివృద్ధి మండలి 1957, జనవరి, 16న బల్వంత్ రాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశ పెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామ పరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది.

బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3-అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసుచేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీ నివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958,జనవరిలో ఆమోదించింది.ఈ నివేదికలోని అంశాల అమలు వివిధ రాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థ ఏర్పాటుకు ప్రయత్నించాయి.

భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్ జిల్లాలోని, సికార్ అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం...'నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడతాయి'. మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్. 1959, నవంబరు 1న ఆంధ్రప్రదేశ్‌లోని రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ వద్ద నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నెహ్రూ ప్రారంభించారు.

బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన ముఖ్యమైన సిఫార్సులు... దేశంలో 3 అంచెల పంచాయతీ రాజ్ విధానం ఏర్పాటు చేయాలి.

1. జిల్లా స్థాయిలో - జిల్లా పరిషత్, 2. బ్లాకు స్థాయిలో-పంచాయతీ సమితి, 3. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామ పంచాయతీ వ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలు జరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి. స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కిందిస్థాయిలో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరిపాలనా, వనరుల, ప్రణాళికా,ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేయాలని బల్వంత్రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగా పరిష్కరించడం, ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్ వ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్య సాధన కోసం స్వాతంత్ర్యానంతరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తనవంతు కృషి చేస్తూనే ఉన్నాయి.


**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# తెలంగాణ యోధుడు కందాళ



బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా, నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కందాళ లక్ష్మణాచార్యులు సమరశీల పోరాటాలు నిర్వహించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. అంటరానితనం, కులవివక్ష, బానిసత్వాలకి వ్యతిరేకంగా ఉద్యమించి పీడిత ప్రజానీకానికి అండగా నిలిచి వారిని చైతన్యవంతులను చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. కుటుంబ ఆస్తిని లూటీ చేసిననూ, భార్యా-పుత్రులను హింసించిననూ తన తల్లిదండ్రులను హత్య గావించిననూ ఆయన ఏమాత్రం అధైర్యపడకుండా చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో భారత జాతీయోద్యమంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొని ఆదర్శంగా నిలిచారు.

కందాళ లక్ష్మణాచార్యులు 1921 లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ( ప్రస్తుత నాగర్ కర్నూలు) లోని పెద్ద ముద్దునూర్ గ్రామంలో రుక్మిణమ్మ, రామకృష్ణాచార్యులు దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించారు. ఆయన 1939 లో వనపర్తిలో 'శారదా భక్త సమాజం' అనే విద్యార్థి సంఘాన్ని స్థాపించి విద్యార్థులను చైతన్యపరిచారు. దేశభక్తిపూరితమైన గేయాల ద్వారా, దేశ స్వాతంత్ర్య నినాదాల ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని కలిగించారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో మున్సిపల్ కార్మికుల సంఘం, రోడ్డు కూలీల సంఘం,ఆల్విన్ ఫ్యాక్టరీ కార్మిక స్థాపించి వారి సమస్యల పరిష్కారాల కోసం ఉద్యమించారు. కందాళ లక్ష్మణాచార్యులు 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు. అనంతరం ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ) లో చేరారు. 1946 నుండి మహబూబ్ నగర్ జిల్లాలో కొల్లాపూర్, అచ్చంపేట, నాగర్ కర్నూలు, వనపర్తి మొదలైన ప్రాంతాలలో ఆయన పార్టీని విస్తరించారు. 1947 ఆగస్టు 15 నాడు హైదరాబాద్‌లోని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర్య జెండాను ఎగురవేసి అరెస్టు అయ్యారు. 1948లో పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌పై దాడిచేసి ఆయుధాలను ఎత్తుకెళ్లి పోలీసు స్టేషన్‌ని



తగులబెట్టారు. ఆ 1948లో నిజాం ప్రభుత్వం కందాళ లక్ష్మణాచార్యులను అరెస్ట్ చేసి రెండు సంవత్సరాల పాటు కాళ్ళకు ఇనుప సంకెళ్ళు తగిలించి కఠిన కారాగార శిక్షని విధించింది. ఆయన తన ఎనిమిది మంది అనుచరులతో జైలు గోడలు బద్దలుకొట్టి బయటపడ్డారు. కందాళ లక్ష్మణాచార్యులు నల్లమల అడవులు కేంద్రంగా అజ్ఞాతవాసం గడుపుతూ సాయుధ పోరాటాలలో పాల్గొన్నారు. ముఖ్యంగా దేవరకొండ నుండి కృష్ణా నది దాకా కామ్రేడ్ బి.ఎన్.రెడ్డి, కామ్రేడ్ రంగక్క నాయకత్వంలో ఉన్నటువంటి అనేక సాయుధ దళాలను సమన్వయం చేసుకుంటూ ఆయన ముందుకు సాగారు. నిజాం పాలన అంతం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన దరిమిలా మరలా రహస్య జీవితాన్ని గడిపారు. కందాళ లక్ష్మణాచార్యులు సహచరి యశోదమ్మ ఆయనతో కలిసి అనేక ప్రజా పోరాటాలలో మరియు అజ్ఞాతంలోనూ ఉద్యమించారు. సి.పి.ఐ పార్టీ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శిగా కందాళ లక్ష్మణాచార్యులు 1952 నుండి 1967 వరకు పనిచేశారు. కందాళ లక్ష్మణాచార్యులు 1972లో అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నుండి 'తామ్ర పత్ర స్వాతంత్ర్య సమరయోధుల ధ్రువపత్రాన్ని' స్వీకరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి ఈ ధ్రువపత్రాన్ని స్వీకరించిన మొదటి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన కందాళ లక్ష్మణాచార్యులు 1976 జనవరి 10న మరణించార.

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# సెప్టెంబర్ 17.. కమ్యూనిస్టుల వారసత్వం



సెప్టెంబర్ 17ను ఎవరు ఎలా గుర్తు చేసుకుంటారన్నది కేవలం ఒక తేదీని ఎంచుకునే విషయం కాదు. అది చరిత్రను ఎవరి కళ్లతో చూస్తున్నామన్న ప్రశ్న. అధికారపు గోడలపై రాసిన చరిత్రను చదువుతామా? లేక ఆ గోడలను కూల్చేందుకు తమ రక్తంతో చరిత్ర రాసిన ప్రజలను గుర్తు చేసుకుంటామా? తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17 ఒక మలుపు. ఒక్కరోజు జరిగిన అధికార మార్పిడి కథ కాదు. దాని వెనుక దశాబ్దాల సామాజిక అసమానత ఉంది. వెట్టిచాకిరీ ఉంది. దొరల దౌర్జన్యం ఉంది. భూమి కోసం, ఆత్మగౌరవం కోసం, బతుకు హక్కు కోసం పేద రైతు, కూలీ, మహిళ, దళితుడు, బహుజనుడు సాగించిన తిరుగుబాటు ఉంది. ఆ తిరుగుబాటుకు రాజకీయ దిశనిచ్చిన కమ్యూనిస్టు ఉద్యమం ఉంది. సెప్టెంబర్ 17ను కమ్యూనిస్టుల వారసత్వం నుంచి వేరు చేసి చూడటం అంటే తెలంగాణ ప్రజా చరిత్రలో ఒక పెద్ద అధ్యాయాన్ని చెరిపేయడమే.

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడినప్పుడు వారి ముందున్న ప్రశ్న కేవలం రాజ్యాధికారం ఎవరిది అన్నది కాదు. తమ భూమి తమదేనా? తమ శ్రమపై తమకే హక్కుందా? వెట్టికి ముగింపు ఎప్పుడు? దొర ముందు తలవంచకుండా బతికే హక్కు ఉందా? స్త్రీకి గౌరవం ఉందా? కుల అవమానానికి ముగింపు ఎప్పుడు? ఇవే ప్రజల అసలు ప్రశ్నలు. ఆ ప్రశ్నలకు సమాధానంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం రూపుదిద్దుకుంది. గ్రామాలు కదిలాయి. ప్రజలు భూస్వామ్య ఆధిపత్యాన్ని సవాలు చేశారు. భూమి కోసం పోరాడారు. అనేక మంది ప్రాణాలు అర్పించారు. మహిళలు కూడా పోరాటంలో ముందుకు వచ్చారు.

సెప్టెంబర్ 17, 1948న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. అది చరిత్రలో ఒక వాస్తవం. భూమి, కూలి, సామాజిక గౌరవం, ప్రజాస్వామ్యం కోసం పోరాటం కొనసాగింది. ఇక్కడే కమ్యూనిస్టుల వారసత్వం మన ముందుకొస్తుంది. ఆ వారసత్వం అంటే కేవలం ఎర్రజెండాను ఎగరేయడం మాత్రమే కాదు. ప్రజల పక్షాన నిలబడటం. అధికారాన్ని ప్రశ్నించడం. భూమిలేనివాడి భూమి ప్రశ్నను, కూలీ వాడి కూలి ప్రశ్నను, మహిళ స్వేచ్ఛను, దళితుడి ఆత్మగౌరవాన్ని, ఆదివాసీ హక్కులను ప్రజాస్వామ్య ప్రశ్నలుగా చూడాలి. కమ్యూనిస్టుల వారసత్వాన్ని కేవలం గతాన్ని గొప్పగా చెప్పుకోవడానికి ఉపయోగిస్తే అది వారసత్వం కాదు. వర్తమానాన్ని మార్చడానికి ఉపయోగించినప్పుడే అది జీవించే వారసత్వంగా ఉంటుంది. ఈరోజు తెలంగాణ మారిపోయింది. దొరల గడీలు చాలావరకు చరిత్రలోకి వెళ్లిపోయాయి. భూమి ప్రశ్న కొత్త రూపాల్లో ముందుకొస్తోంది. కార్పొరేట్ ఆధిపత్యం



పెరుగుతోంది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పేర్లతో శ్రమను అస్థిరం చేస్తున్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వ విద్య, వైద్యం బలహీన పడుతున్నాయి. రైతు అప్పు, పంటధర, సాగునీరు, భూహక్కుల ప్రశ్నలు ఇంకా పరిష్కారం కాలేదు. కుల వివక్ష అంతరించలేదు. మహిళలపై హింస ఆగలేదు. మతం పేరుతో ప్రజలను విడదీసే రాజకీయాలు బలపడుతున్నాయి. మీడియాపై అధికార - కార్పొరేట్ ఒత్తిడి పెరుగుతోంది. అంటే దోపిడీ పోయిందా? కాదు, దాని రూపం మారింది. అందుచేత సెప్టెంబర్ 17 మనకు ఒక జ్ఞాపక దినం మాత్రమే కాదు. ఒక ప్రశ్నించే రోజు. కమ్యూనిస్టు ఉద్యమం ఏ వారసత్వాన్ని మనకు అందించింది? ఆ వారసత్వాన్ని నేటి తరానికి ఎలా అందించాలి? ప్రజల జీవితాల్లో దానికి అర్థం ఏమిటి? అనేది చూడాలి. మొదటి కర్తవ్యం చరిత్రను మతపరమైన ఘర్షణగా కుదించడాన్ని అడ్డుకోవడం. తెలంగాణ రైతాంగ పోరాటాన్ని హిందూ - ముస్లిం పోరుగా చిత్రించడం చరిత్రకు అన్యాయం. నిజాం నిరంకుశత్వాన్ని వ్యతిరేకించడం ఒకటి, ముస్లిం ప్రజలను శత్రువులుగా చూపించడం మరొకటి. ప్రజల పోరాటం దోపిడీకి వ్యతిరేకం. మతానికి వ్యతిరేకం కాదు. రెండో కర్తవ్యం కమ్యూనిస్టుల త్యాగాలను ప్రజల సామాజిక చరిత్రలో తిరిగి నిలబెట్టాలి. పేరు తెలియని గ్రామీణ కార్యకర్తలు, మహిళా పోరాట యోధులు, రైతులు, కూలీలు, దళితులు, బహుజనులు, ఆదివాసీల వీళ్ల కథలు పుస్తకాల అంచుల్లో కాకుండా కొత్త తరానికి చేరాలి. భూమి కోసం పోరాడుతున్న రైతు నుంచి ఉపాధి కోసం పోరాడుతున్న యువకుడి వరకు, సమాన వేతనం కోరుతున్న మహిళ నుంచి కుల వివక్షను ఎదిరిస్తున్న దళిత యువత వరకూ ప్రతి ప్రజా పోరాటాన్ని ప్రజాస్వామ్య హక్కుల విస్తరణగా చూడాలి. నాలుగో కర్తవ్యం కమ్యూనిస్టు ఉద్యమం నుంచి వచ్చిన అత్యంత విలువైన పాఠాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజల మధ్యకు వెళ్లకుండా ప్రజల కోసం రాజకీయాలు చేయలేం. సభల్లో నినాదాలు చేయడం కంటే బస్తీలో, పల్లెలో, కర్మాగారంలో, విశ్వవిద్యాలయంలో, పొలంలో ప్రజల సమస్యలతో నిలబడటం ముఖ్యం.

సెప్టెంబర్ 17ను అధికారిక ఉత్సవాల మధ్య పరిమితం చేయాలని ప్రయత్నించే ప్రతి రాజకీయానికి ఎదురుగా ప్రజా చరిత్రను నిలబెట్టాలి. తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వం ప్రజలది. నేడు మన ముందున్న తక్షణ కర్తవ్యం స్పష్టంగా ఉంది. మత విద్వేషానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ఐక్యతను నిర్మించాలి. కుల వివక్షకు వ్యతిరేకంగా సామాజిక న్యాయ పోరాటాలను బలోపేతం చేయాలి. మహిళలపై హింసకు వ్యతిరేకంగా సమానత్వ పోరాటాలను విస్తరించాలి. రాజ్యాంగ హక్కుల పరిరక్షణను ప్రజా ఉద్యమాల కేంద్రంగా మార్చాలి.

అప్పుడు మాత్రమే తెలంగాణ రైతాంగ పోరాట వారసత్వానికి నిజమైన గౌరవం లభిస్తుంది. విలీనం ఒక చారిత్రక పరిణామం. విమోచనం ఒక రాజకీయ నిర్వచనం. కానీ, ప్రజల తిరుగుబాటు తెలంగాణ చరిత్రకు ప్రాణం. ఆ తిరుగుబాటుకు ఎర్రజెండా అందించిన కమ్యూనిస్టుల వారసత్వం గతంలో ముగిసిన అధ్యాయం కాదు. ప్రజల పక్షాన నిలబడే ప్రతి అడుగులో అది బతికే ఉంటుంది. చరిత్రను కాపాడటం అంటే గతాన్ని పూజించడం కాదు. ప్రజల పోరాట స్ఫూర్తిని వర్తమానంలోకి తీసుకురావడం. సెప్టెంబర్ 17 మనకు అదే పిలుపునిస్తోంది.

**- మామిండ్ల రమేష్ రాజా**
78932 30218

## ఫిల్మ్ నగర్ భూ కేటాయింపుపై
# సీఎం హామీ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 19:** ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు భూమి కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పి. విష్ణు కుమార్ రాజులు సీఎం చంద్రబాబు నాయుడుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. 2014 - 19 టీడీపీ ప్రభుత్వ హయంలో ఫిల్మ్ నగర్ కు శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిమ్మాపురంలో 5 ఎకరాల భూమి కేటాయించారు. అయితే ఆ ఉత్తర్వుల్లో కొన్ని సాంకేతిక అంశాలు పేర్కొనకపోవడం వల్ల ఆ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. సాంకేతిక అంశాలు సరి చేస్తూ జీఓ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హోదాలో గంటా గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లను ప్రత్యేకంగా కలిసి కోరారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి విశాఖ వచ్చిన సీఎం దృష్టికి ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు విషయం ఎమ్మెల్యేలు మరోసారి తీసుకువెళ్లగా ఆయన తన కార్యదర్శి ప్రద్యుమ్నతో మాట్లాడారు. వెంటనే భూ కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ప్రద్యుమ్నకు సీఎం సూచించారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు వేగవంతం చేయాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సంబంధిత అధికారులకు జారీ చేసిన లేఖను జత చేసి సీఎంకు అందజేశారు.

# ఆర్కే బీచ్‌లో స్వర్ణాంధ్ర..

## సాగర స్వచ్ఛత కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ముఖ్యమంత్రి
## పెదజాలరిపేట ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ వర్చువల్ ప్రారంభం





**విశాఖపట్నం, సెప్టెంబర్ 19:** విశాఖపట్నం ఆర్కే బీచ్లో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సాగర స్వచ్ఛత కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పెదజాలరిపేటలో ఓషన్ ప్లాస్టిక్ రికవరీ సెంటర్ పైలట్ సైట్ను వర్చువల్‌గా పారంభించారు. అనంతరం సముద్ర వ్యర్థాలను సేకరించే పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులు, స్కూబా డైవర్లతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. చేపల వేటతో పాటు సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణతో లభించే ప్రోత్సాహంతో తమకు అదనపు ఆదాయం వస్తోందని మత్స్యకారులు ముఖ్యమంత్రికి తెలిపారు.సముద్ర ఉపరితలంలో సేకరించిన వ్యర్థాలను డిజిటల్ తూకం వేసే విధానాన్ని సీఎం పరిశీలించారు. సముద్రంలో ప్లాస్టిక్ వ్యర్థాలసేకరణ ద్వారా లభించే ప్రోత్సాహకాన్ని మత్స్యకారులకు అందజేశారు. సముద్ర గర్భంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత వలలు తొలగిస్తున్న విధానాన్ని స్కూబా డైవర్లను అడిగి తెలుసుకున్నారు. సాగర స్వచ్ఛతలో భాగంగా ఏకంగా 1,200 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. మ్యాన్హోళ్లు, మురుగు కాల్వల శుభ్రత కోసం జీవీఎంసీ అందుబాటులోకి తెచ్చిన ఆధునిక సీవరేజ్ రోబో పనితీరును ప్రదర్శనశాలలో పరిశీలించారు. జీవీఎంసీ సాగర స్వచ్ఛత ప్రాజెక్టుకు లభించిన గ్లోబల్ గుర్తింపు, భవిష్యత్తు లక్ష్యాలపై బ్లూమ్బెర్గ్ ప్రతినిధులతో చర్చించారు. మానవీయ స్పందన: సాగర తీరంలో మురి మిక్చర్ విక్రయించే మహిళ జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె విక్రయించే మురి మిక్చర్ను ఆస్వాదించిన చంద్రబాబు, ఆమె ఒంటరి మహిళ అని తెలుసుకుని వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని అధికారులకు ఆదేశించారు.

# వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## బయోగ్యాస్, సీ అండ్ డీ ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలి
## సీ అండ్ డీ వ్యర్థాలతో తయారైన ఉత్పత్తులను జీవీఎంసీ పనుల్లో ఉపయోగించాలి
## రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ

విశాఖపట్నం, సెప్టెంబర్ 19: నగరంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చేందుకు కాపులుప్పాడలో ఏర్పాటు చేసిన ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని బయోగ్యాస్ ప్లాంట్, నిర్మాణ-కూల్చివేత (సీ అండ్ డీ) వ్యర్థాల శుద్ధి ప్లాంట్ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్లాంట్ల సామర్థ్యం, వ్యర్థాల సేకరణ, శుద్ధి ప్రక్రియ, ఉత్పత్తి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి బయోగ్యాస్ ప్లాంట్కు తరలించే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. హోటళ్లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల నుంచి తడి వ్యర్థాలు నిరంతరాయంగా ప్లాంట్కు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని సమర్థవంతంగా చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అదేవిధంగా నగరంలో ఉత్పత్తయ్యే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వాటిని సీ అండ్ డీ ప్లాంట్కు తరలించి శాస్త్రీయంగా శుద్ధి చేసే విధంగా సమగ్ర వ్యవస్థను అమలు చేయాలన్నారు. ప్లాంట్ల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి, నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్కు సూచించారు.



అనంతరం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి కలిసి సీ అండ్ డీ వ్యర్థాల శుద్ధి ప్లాంట్ను పరిశీలించారు. ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావును అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ప్లాంట్ను నిర్వహించలేని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టి, జీవీఎంసీ ఆధీనంలోకి తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) రూపొందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సీ అండ్ డీ వ్యర్థాల ద్వారా తయారైన పేవర్ బ్లాకులు, బిల్డింగ్ బ్లాకులు, ఇటుకలు తదితర ఉత్పత్తులను జీవీఎంసీ చేపట్టే ఇంజనీరింగ్, అభివృద్ధి పనుల్లో వినియోగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజును ఆదేశించారు. తద్వారా నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగంతో పాటు సహజ వనరుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు.

ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, డీసీపీ రామ్మోహన్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు ,అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఎల్. రాజా రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మంగాపురం కాలనీలో అంగరంగ వైభవంగా
# వినాయక అన్నసమారాధన



**విశాఖపట్నం మనం న్యూస్ :** మంగాపురం కాలనీలో హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగాపురం కాలనీ తారా మసీదు సమీపంలో ఎం. పుష్పలత-పండు దంపతుల ఆధ్వర్యంలో, ఎంపీసీ బాయ్స్ గరల్స్ సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విగ్రహ దాత ఆర్ జె హోమ్స్ మణికొండ మణికంఠ అందించారు.ఈ కార్యక్రమంలో యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.యూత్ తరఫున రాజు, హారిక, పండు టైలర్, పుష్ప, కుమార్,మానసా, భాగ్య, కిట్టు, కవిత, అఖిల్, ఇమ్రాన్, తిరుపతి, బన్నీ, సందీప్, జోను, ప్రణయ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించారు. హిందూ-ముస్లిం సోదరభావం,మత సామరస్యం చాటేలా వినాయక చవితి సందర్భంగా అన్నసమారాధన నిర్వహించడం పట్ల స్థానికులు నిర్వాహకులను అభినందించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 22వ వైస్సార్సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ హాజరై దేవుడి దక్షిణ అందించి నిర్వాహకులను అభినందించారు మరియు గౌరవ అతిథిగా మనం పేపర్ రీజనల్ బ్యూరో చీఫ్-మరియు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్ ఎం.వీ.ఎస్.జీ. తిలక్ మరియు మీడియా ప్రతినిధులు మరియు అఖిల్ పాల్గొని వినాయకుని దీవెనలు అందుకున్నారు

# కలర్ ఫుల్ షర్ట్ లో అదిరి పోయావయ్యా...!!

## గంటా కు భుజం తట్టిన సిబిఎన్
## సరదా వ్యాఖ్యలతో ఆహ్లాదకర వాతావరణం



**ఆనందపురం, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కోసం శనివారం విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమం సందర్భంగా గంటా ధరించిన రంగురంగుల చొక్కాను ప్రస్తావిస్తూ సీఎం సరదాగా వ్యాఖ్యానించడంతో అక్కడున్న నాయకుల మధ్య కొద్దిసేపు ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వేదిక వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి గంటా శ్రీనివాసరావు తదితర నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంటాను పలకరించిన సీఎం.. ఆయన భుజం తడుతూ మాట్లాడారు. అనంతరం నాయకులతో కలిసి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులను ఉద్దేశించి సీఎం సరదాగా వ్యాఖ్యానించారు.

సీనియర్ నాయకులిద్దరూ ప్రస్తుతం ఉత్సాహంగా, ఆరోగ్యంగా కనిపిస్తున్నారని సీఎం వ్యాఖ్యానించగా.. దీనికి గంటా స్పందిస్తూ విశాఖలో ఎల్నినో, వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటి సమస్యపై ఆందోళన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన సంభాషణ అక్కడున్న నాయకుల్లో ఆసక్తి కలిగించింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబాలకు హక్కులు కల్పించే కార్యక్రమంలో భాగంగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులు కూడా పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వారిని పలకరించారు.

విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు వాటిపై హక్కులు కల్పించే చర్యల్లో భాగంగా పట్టాల పంపిణీ చేపట్టారు. జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలిగింది. ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా భీమిలి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. వారి సమస్యలు, పట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా లబ్ధిదారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ‘వికసిత భారత్ 2047’
# లక్ష్య సాధనే ధ్యేయం



**న్యూఢిల్లీ,అమరావతి, సెప్టెంబర్,19 (మనం ప్రత్యేక ప్రతినిధి):** ‘విజన్ 2047’ లక్ష్యాల సాధన కోసం దేశంలోనూ, వివిధ రాష్ట్రాలు తమ లక్ష్యాలను ఏ విధంగా నిర్దేశించుకోవాలి, ఆ లక్ష్యాలను చేరుకోవడానికి ఆర్థిక వనరులను ఏ రకంగా సమీకరించుకోవాలి అనే అంశాలపై కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులు నిపుణులతో అత్యున్నత స్థాయి బ్రెయిన్స్టార్మింగ్ సెషన్ జరిగినట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే సాధారణ నిధులకు భిన్నంగా, భవిష్యత్ అవసరాల కోసం అదనపు వనరులను ఎలా సమకూర్చుకోవాలనే కోణంలో ఈ సదస్సు ఉపయోగపడిందని ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ న్యూఢిల్లీలోని ఏపీ భవన్లో ప్రత్యేకంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ఆర్థిక శాఖ నేతృత్వంలో అన్ని రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులు, ప్రైవేట్ రంగ నిపుణులు, ఆర్థిక వేత్తలు, రిటైర్డ్ సీనియర్ బ్యూరోక్రాట్లతో కలిసి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది ఒక గొప్ప శుభపరిణామమని ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో ప్రధానంగా కీలక రంగాలపై దృష్టి పెట్టామని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగంలో ఉన్న సవాళ్లు, ఆ రంగానికి కావలసిన పెట్టుబడులు, క్రెడిట్ ఫెసిలిటీస్, వాటర్ ఇంటిగ్రేషన్, రైతులకు ఎదురయ్యే క్లైమేట్ మార్పుల రిస్కును తగ్గించడం వంటి అంశాలపై చర్చించినట్లు చెప్పారు. అలాగే ఎనర్జీ రంగంలో అవకాశాలు, పబ్లిక్-ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యాన్ని పెంచడంపై టాటా గ్రూప్, కోటక్ గ్రూప్ నిపుణులు, మాజీ ప్లానింగ్ కమిషన్ చైర్మన్ల సలహాలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో విజయవంతమైన ప్రయోగాలను ఇక్కడ చర్చించామని, ఇది కేంద్రానికి, రాష్ట్రాలకు మరియు సమాజానికి భవిష్యత్తులో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో హార్టికల్చర్ అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ చివరి వారంలో లేదా అక్టోబర్ మొదటి వారంలో మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ప్రారంభోత్సవాన్ని నిర్వహించాలని భావిస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ని కూడా ఆహ్వానించడం జరిగిందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన తేదీలు ఖరారు కానున్నాయని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై స్పందిస్తూ.. ఈసారి ఎల్నినో ప్రభావం దక్షిణ భారతదేశంలో చాలా తీవ్రంగా ఉందని, దీనివల్ల తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముందుగా ఉన్న పంటలను కాపాడుకోవడం, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి మార్గదర్శకాల మేరకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రెస్ మీట్లో వివరించారు.

# ప్రతి పాము కాటు ప్రాణాంతకం కాదు

(మొదటి పేజీ తరువాయి)

విషపూరితమైనవని తెలిపింది. రాష్ట్రంలో తాచు పాము, రక్త పింజర, కట్ల పాము విషపూరితమైనవని తెలిపింది. ప్రకృతి సమతుల్యతలో పాములు కూడా ఒక భాగమని, ఆత్మ రక్షణకు తప్ప మనుషులపై పాములు దాడి చేయవని పేర్కొంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటే పాములు పరిసరాలకు రావని తెలిపింది. సెప్టెంబర్ 19 మంచి 25వ తేదీ వరకు అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారంనాడు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు, నేషనల్ హెల్త్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అర్జునరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని స్థాయిల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో పాముకాటు విరుగుడు మందు (-యాంటీ వెనమ్) అందుబాటులో ఉందన్నారు. పాటు కాటు విరుగుడుకు సంబంధించి వైద్య సేవల్ని బాధితులకు మరింత చేరువ చేసేందుకు 108 వాహనాల్లోనూ మందును అందుబాటులో ఉంచామన్నారు. ఈ సేవల ద్వారా 9 మందికి తక్షణ వైద్య సాయాన్ని అందించి ప్రాణాల ముప్పు నుంచి కాపాడామని మంత్రి తెలిపారు.

### గత మూడేళ్లలో కేసుల వివరాలు–

**శ్రీకాకుళంలో అత్యధికం**

రాష్ట్రంలో గత మూడేళ్లలో పాము కాటు కేసులు దాదాపు 4,500 నుంచి 4,800 మధ్య నమోదయ్యాయి. 2023లో 4,809, 2024లో 4,573, 2025లో 4,702 కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి నుంచి ఆగస్టు వరకు 4,111 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కేసులు పెరుగుతూ జూలైలో 890, ఆగస్టులో 1,051 కేసులు నమోదయ్యాయి. 2026 జనవరి-ఆగస్టు మధ్య శ్రీకాకుళంలో అత్యధికంగా 706 పాము కాటు కేసులు నమోదయ్యాయి. పశ్చిమగోదావరిలో 369, విజయనగరంలో 307, కృష్ణాలో 296, ఏలూరులో 271 కేసులు నమోదయ్యాయి. తీర, గ్రామీణ ప్రాంతాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉండగా, అటవీ, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

### తగ్గుతున్న మరణాలు

2024- 41
2025- 13
2026- 6 (ఇప్పటి వరకు)

అందుబాటులో విరుగుడు మందు

పాము కాటుకు ఉపయోగించే విరుగుడు మందును అవసరమైన వైద్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. సెప్టెంబర్ 18 నాటికి జిల్లాల వారీగా మొత్తం 2,807 మోతాదులు నిల్వ ఉన్నాయి. విజయనగరంలో 1,391, నెల్లూరులో 364, కృష్ణాలో 267, పశ్చిమగోదావరిలో 260, కర్నూలులో 213 మోతాదులు ఉన్నాయి.

### 108లో అత్యవసర సేవలు.. 9 మందికి విరుగుడు మందు

పాముకాటు బాధితులకు ఆసుపత్రికి చేరుకునేలోపే అవసరమైన అత్యవసర వైద్యం అందించేందుకు 2026 జనవరి నుంచి 108 అంబులెన్సుల్లో పాముకాటు విరుగుడు మందు అందుబాటులో ఉంచారు. బాధితుడి పరిస్థితిని పరిశీలించి, నిర్దేశిత అత్యవసర వైద్య విధానాల ప్రకారం అవసరమైన వారికి అత్యవసర వైద్య సిబ్బంది మందును అందిస్తున్నారు. ఇప్పటివరకు 9 కేసుల్లో 108 సిబ్బంది విరుగుడు మందు అందించారు.

### తీవ్ర విషప్రభావం.. అంబులెన్సులోనే సత్వర స్పందన

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గుడుబాయి తండాకు చెందిన 45 ఏళ్ల చెన్నిబాయి జూలై 18న మొక్కజొన్న పొలంలో కలుపు తీస్తుండగా పాముకాటుకు గురయ్యారు. తొలుత కుటుంబ సభ్యులు ఆమెను హుస్సేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ విరుగుడు మందు అందుబాటులో లేకపోవడంతో కర్నూలుకు వెంటనే తరలించాలని సూచించారు. 108లో తరలించే సమయంలో అత్యవసర వైద్య సిబ్బంది ఆమెను పరీక్షించారు. కాటు వేసిన చోట తీవ్రమైన వాపు, మగత, చూపు మసకబారడం, స్వల్పంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ స్థాయి 93 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. విషప్రభావం శరీరమంతా వ్యాపించే సూచనలు ఉండటంతో విరుగుడు మందు, అవసరమైన శ్వాస సహాయం, అత్యవసర చికిత్స అందుబాటులో ఉన్న ఉన్నత వైద్య కేంద్రానికి వెంటనే తరలించారు.

### నిద్రిస్తున్న సమయంలో పాముకాటు.. వెంటనే 108కు సమాచారం

బాపట్ల జిల్లా చీరాల మండలం బర్లవారిపాలెం గ్రామానికి చెందిన 40 ఏళ్ల వెంకయ్య నిద్రిస్తున్న సమయంలో రాత్రి 8 గంటల ప్రాంతంలో పాముకాటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. అత్యవసర వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా ఎడమ కాలికి చీలమండపైభాగంలో కాటు గుర్తించారు. ఆ సమయంలో ఆయన స్పృహలోనే ఉన్నారు. రక్తపోటు 110/80, గుండె కొట్టుకునే వేగం నిమిషానికి 80, శ్వాస వేగం 16, రక్తంలో ఆక్సిజన్ స్థాయి 98 శాతంగా ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితిని అంచనా వేసి తదుపరి వైద్యం కోసం తగిన వైద్య కేంద్రానికి తరలించారు. ఈ ఇద్దరు బాధితుల ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం తరువాత తెలుసుకోగా ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

### ఈ జాగ్రత్తలు పాటిస్తే..

పాము కరిస్తే బాధితుడిని ప్రశాంతంగా ఉంచి, కరిచిన అవయవాన్ని కదలకుండా ఉంచాలి. ఉంగరాలు, గాజులు, కడియాలు వంటి బిగుతైన వస్తువులను తొలగించి, ఆలస్యం చేయకుండా సమీప వైద్య కేంద్రానికి తీసుకెళ్లాలి. గాయాన్ని కోయడం, విషాన్ని నోటితో పీల్చడం, గట్టిగా తాడుతో కట్టడం, స్వయంగా మందులు లేదా మూలికలు వేయడం చేయకూడదు. రాత్రివేళ బయటకు వెళ్లేటపుడు టార్చ్ ఉపయోగించడం, చెప్పులు ధరించడం, నేలపై నిద్రించకుండా జాగ్రత్తలు తీసుకోవడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పాము కాటు ప్రమాదాన్ని తగ్గించవచ్చని శాఖ సూచించింది. పాము కనిపిస్తే దాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించకుండా గుర్తింపు పొందిన పాము రక్షకుల సహాయం తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ పేర్కొంది.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు బెంగళూరు పర్యటన

**అమరావతి, సెప్టెంబర్ 19,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం బెంగళూరులో పర్యటించనున్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బయలుదేరి వెళ్తారు. సాయంత్ర 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు బెంగళూరులోని ‘ది ఎర్త్ సెంటర్, విస్టా స్పేసెస్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని రాత్రికి బెంగళూరులోనే బస చేస్తారు. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి ముఖ్యమంత్రి నేరుగా చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి చేరుకుంటారు. అక్కడ హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ జలహారతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. కుప్పం నియోజకవర్గంలో రైతు బజార్కు శంకుస్థాపన సహా కుప్పం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేస్తారు. రూ.289.5 కోట్ల విలువైన పనులు ప్రారంభించుకోవడంతో పాటు...రూ.38.5 కోట్ల విలువైన పనులకు సీఎం శంకుస్థాపనలు చేస్తారు. స్వర్ణ కుప్పం విజయాలను ప్రదర్శించే వీడియోను వీక్షిస్తారు. లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడతారు. కుప్పం కొత్తపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. స్వర్ణ కుప్పం అచీవ్మెంట్స్ గ్యాలరీని సందర్శిస్తారు. హిందాల్కో ప్రతినిధులతో సమావేశమవుతారు. జాతీయ రహదారి ప్రాజెక్టులపై సమీక్షిస్తారు. ఆరోజు రాత్రి... దాదర్-పుదుచ్చేరి ఎక్స్ప్రెస్కు కుప్పం రైల్వే స్టేషన్లో అదనపు హాల్ట్ను ప్రారంభిస్తారు. కుప్పం పర్యటనలో రెండవరోజు మంగళవారం..ఉదయం 11 గంటలకు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో చేపట్టిన రూ.9,000 కోట్ల విలువైన హెచ్ఏయం పనులని సీఎం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి మాట్లాడతారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు కేడర్ మీటింగ్లో పాల్గొంటారు. అదేరోజు సాయంత్రానికి తిరిగి అమరావతి చేరుకుంటారు.

# జనసేనతో వరుపుల సుబ్బారావు దోస్తీకి రంగం సిద్ధమా..?

- రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ..!
- 21 న పిఠాపురంలో పవన్ సమక్షంలో చేరే అవకాశం
- చేరితే ఈ మాజీ ఎమ్మెల్యేకు జనసేన నాలుగో పార్టీ
- జనసేనలో వరుపుల కుటుంబం నుంచి నాలుగో నేత
- మారనున్న ప్రత్తిపాడు జనసేన రాజకీయ ముఖచిత్రం....?



శంఖవరం సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు చూపు జనసేన పార్టీ వైపే ఉందని, ఈయన ఆ పార్టీలో చేరతారనీ రాజకీయ వర్గాల్లో లోపాయికారీ ప్రచారం జరుగుతోంది. ఈ నెల 21న పిఠాపురం పర్యటనకు రానున్న జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో వరుపుల సుబ్బారావు ఆ పార్టీలో చేరి పార్టీ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందనీ విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగు దేశం పార్టీల్లో ఆయా కాలాల్లో రాజకీయంగా నిలదొక్కు కున్నారు. తాజాగా 21వ తేదీన చేరిక ఉంటుందన్న ప్రచారం మరోసారి రాజకీయంగా వినబడుతోంది. తాజాగా జనసేన పార్టీ కండువా కప్పుకోడం గనుక జరిగితే ఆయనకు తన రాజకీయ జీవిత చరిత్రలో జనసేన నాలుగో పార్టీ అవుతుంది. ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి వరుపుల తమ్మయ్యబాబుని క్రమశిక్షణా రాహిత్యం కారణంగా పార్టీ నుండి లోగడ సస్పెండ్ చేసారు. ఐతే తమ్మయ్యబాబు భార్య, ఎంపీటీసీ సభ్యురాలు వరుపుల దుర్గ, వీరి కుమారుడు సాయి కిరణ్ పార్టీలోనే పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. వరుపుల సుబ్బారావు జనసేనలో చేరితే వరుపుల కుటుంబం నుంచి నాలుగో నేత అవుతారు.

**వరుపుల రాజకీయ ప్రస్థానం...**

తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు తోడల్లుడైన వరుపుల సుబ్బారావు కాపు సామాజిక వర్గానికి చెందిన వారు. తొలుత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1983 నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీ చేస్తూ వస్తున్నారు. తొలుత కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చేతిలో ఓటమి పాలయ్యారు. టీడీపీలో చేరిన వరుపుల మరోమారు ముద్రగడ చేతిలోనే ఓడిపోయారు. తొలి సారిగా 2004లో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడారు. 2014లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2016 ఏప్రిల్ 8న తెలుగు దేశం పార్టీలోకి ఫిరాయించారు. 2019 ఎన్నికల్లో సుబ్బారావుకు కాకుండా ఆయన మనువడు వరుపుల రాజాకు ఎమ్మెల్యే టికెట్టును ఆ పార్టీ కేటాయించడంతో తిరిగి వరుపుల సుబ్బారావు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆపై 2024లో హ్యాట్రిక్ కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి పరాజయాన్ని చవిచూసారు. దీంతో దాదాపు రెండున్నరేళ్లుగా క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల తన రాజకీయ భవిష్యత్తును నిర్ణయించు కున్నారని అంటున్నారు. ఈ నేపధ్యంలోనే జనసేన పార్టీలో చేరతారంటూ ప్రచారం జరుగుతోంది. ఐతే జనసేన పార్టీలో చేరికపై ఇప్పటి వరకు పార్టీ నుంచి కానీ, వరుపుల సుబ్బారావు నుంచి కానీ ఇంకా ఎటువంటి అధికారిక బహిరంగ ప్రకటనా వెలువడలేదు.

# శంఖవరం మండలంలో 56 పోలింగ్ కేంద్రాలు

## 16 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు తుది జాబితా ప్రచురణ...



శంఖవరం, సెప్టెంబర్ 19 (మనం ప్రతినిధి): మండల పరిషత్, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల రెండో సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా శంఖవరం మండలానికి సంబంధించిన తుది పోలింగ్ కేంద్రాల జాబితాను శంఖవరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి యు. నాగేంద్ర శనివారం ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ నంబర్ 120/ఎస్ఈసీ-బి1/2026, తేదీ 27-03-2026లోని నిబంధన 6(ఎ), అలాగే సర్క్యులర్ నంబర్ 533/ఎస్ఈసీ-బి1/2026, తేదీ 09-09-2026లో సూచించిన షెడ్యూల్ ప్రకారం ఈ తుది జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు.

శంఖవరం మండలంలో మొత్తం 16 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు 56 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రజల పరిశీలనార్థం శంఖవరం మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుతో పాటు సంబంధిత గ్రామ పంచాయతీల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ తుది జాబితా ప్రచురణ లో డిప్యూటీ ఎంపీడీవోలు నాగలక్ష్మి, వెంకయ్యమ్మ, ఏవో పుష్యమి కీర్తి తదితరులు ఉన్నారు.

# ఎలమంచిలిలో పోషణ మాస కార్యక్రమం



ఎలమంచిలి సెప్టెంబర్ 19 మనం న్యూస్: ఎలమంచిలి అంగన్వాడీ కేంద్రంలో శనివారం 9వ జాతీయ పోషణ్ మాసం కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్వైజర్ ఎం ఎన్ పద్మావతి తెలిపారు ఐసిడిఎస్ సిడిపిఓ ఉమా ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు పిల్లలకు జంక్ ఫుడ్ అలవాటు చేయకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పులు, మాంసం, చేపలు, పండ్లు వంటి పోషకాహారం ఇవ్వాలని బాలింతలకు సూచించారు కార్యక్రమంలో ఆరోగ్య, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం

- హమారా ప్రస్నా అన్నవరం పోలీసులకు బీఎస్పీ దళిత సంఘాలు ఫిర్యాదు



శంఖవరం సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆయనను కించపరిచే విధంగా 'కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రచించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రస్నా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గునపర్తి అపురూప్ అన్నవరం పోలీసులను కోరారు.బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ ఆదేశాల మేరకు, కాకినాడ జిల్లా బీఎస్పీ అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం (సుబ్బు బాయ్) సారథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జ్ గునపర్తి అపురూప్, పార్టీ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు అన్నవరం పోలీస్ స్టేషన్కు వెళ్లి పోలీసు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హమారా ప్రస్నా రాతపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు, ఆయనను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ పుస్తకం రచించడం ద్వారా అంబేద్కర్ను గౌరవించే ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రతిపాడు నియోజకవర్గ అధ్యక్షులు కొంగు రమేష్, ప్రధాన కార్యదర్శి గునపర్తిదళిత సంఘాల ప్రతినిధులు జె బి పి జిల్లా ఉపాధ్యక్షులు బత్తిన తాతాజీ, జిల్లా అధికార ప్రతినిధి ముఖే వీరబాబు, చెక్క బీమరాజు తదితరులు పాల్గొన్నారు.

# 150 ఏళ్లుగా వరదలకు గ్రామ ప్రజలకు రక్షణ కల్పిస్తున్న చేగొండి వారి పెద్ద పెంకుటిల్లు



పాలకొల్లు, సెప్టెంబర్ 19,మనం ప్రతినిధి: పూర్వకాలం నుంచి అనగా గత 150 సంవత్సరాల నుంచి ఏటా గోదావరి వరదలు వచ్చినప్పుడు చుట్టుపక్కల ప్రజలకు ఎంతో రక్షణగా నిలుస్తోంది పశ్చిమగోదావరి జిల్లా ఎలమంచిలి మండలం మండలం దొడ్డిపట్ల గ్రామంలోని మామిడి తోట లో గల స్వర్గీయ చేగొండి బ్రహ్మయ్య అనే పెద్ద గారి పెంకుటిల్లు . పూర్వకాలంలో ఏటి గట్లు బాగా బలహీనంగా ఉండడంతో ఏటా వర్షాకాలం వచ్చినప్పుడల్లా గోదావరి పొంగి ఒకే పోవడంతో దొడ్డిపట్ల మెయిన్ రోడ్డు అవతల కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ఏరియా మామిడి తోట ప్రాంతం బాగా పల్లంగా ఉండడంతో చాలా ఇల్లు మునిగిపోయి ఇళ్లలోకి నీరు చేరేదని, ఆ సమయంలో ఈ ఇల్లు బాగా ఉపయోగపడేదని పలువురు అంటున్నారు. ముఖ్యంగా 1986 వరదల్లో కూడా చాలా బాగా ఈ చుట్టుపక్క ప్రాంత ప్రజలకు ఉపయోగపడిందని ప్రజలు చెప్తున్నారు. మామిడి తోట లో వరదలకు తట్టుకునే పెద్ద ఎత్తైన అతి పెద్ద ఇల్లు ఇది ఒక్కటే కావడం , ఏవైనా గ్రామ సమస్యలు వచ్చినప్పుడు ప్రజలకు మంచి చెడ్డలు వివరించి తీర్పు చెప్పడం తో బ్రహ్మయ్యను అప్పట్లో 'పెద్ద 'గా ఆ గ్రామస్తులు సంబోధించేవారు. ఈ పెద్ద పెంకుటిల్లు గోదావరి ఏటిగట్టు పక్కనే 150 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఈ ఇల్లు చుట్టుపక్కల ఇండ్ల కంటే అత్యంత ఎత్తైన పురాతన పెంకుటిల్లు కావడంతో ఏటా గోదావరి వరదలు వచ్చినప్పుడు అన్ని ఇండ్లలోకి నీరు చేరినప్ప టికి ఈ ఇంట్లోకి మాత్రం వచ్చేది కాదు. దీంతో గోదావరి వరదలు వచ్చినప్పుడు పూర్వకాలంలో అన్ని ఇండ్ల నుంచి ప్రజలు ఇక్కడకు వచ్చి వరద తీసే వరకు తలదాచుకునేవారని ఆ ప్రాంత ప్రజలు తెలిపారు. బ్రహ్మయ్య కుమారుడు వెంకట సత్యనారాయణ ఈ ఇల్లు స్వరూపం మార్చుకూడదనే ఉద్దేశంతో కొత్త భవనానికి అయ్యే ఖర్చు అయినప్పటికీ ఈ పెంకుటిల్లుకు లక్ష లాది రూపాయలు వ్యయం చేసి చెక్కు చెదర కుండా సంరక్షిస్తున్నారు. సత్యనారాయణ కుమారులు బాబ్జి, రాంబాబు, కేశవ కూడా తండ్రికి సహకరిస్తూ ఇంటిని సంరక్షిస్తున్నారు. ఇప్పటికీ పెద్ద పెద్ద వరదలు వచ్చిన సమయంలో ఇంటి చుట్టుపక్క ప్రాంత ప్రజలకు ఎంతో రక్షణగా నిలుస్తున్న పెద్దగారిల్లు మామిడి తోటలో ఉండడం పట్ల ఆ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# చర్చి వ్యవహారంలో న్యాయపరమైన చర్యలు తీసుకోవాలి



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 19 మనంన్యూస్ః తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని కడియద్ద గ్రామంలో ఇటీవల పంచాయతీ అధికారుల ద్వారా సీజ్ చేసిన చర్చి వ్యవహారం పై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర సిజెఎసి అధ్యక్షులు, లాయర్ పాస్టర్ చేగుడి జాషువా డానియల్ ఆధ్వర్యంలో పాస్టర్ ఇజ్రాయిల్ చర్చిని సీజ్ చేసిన వ్యవహారం పై పూర్తిస్థాయిలో పరిశీలించి, న్యాయపరంగా సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు .బహుజనసేన రాష్ట్ర కోఆర్డినేటర్ గుంపుల సత్యకృష్ణ , మానుకొండ డల్లా ఆర్డీవోను కలిసి సమస్యను శాంతియుతంగా, న్యాయబద్ధంగా పరిష్కరించాలని కోరారు. క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 2న జర్నలిస్టుల కోర్కెలదినం జయప్రదం చేయండి

- ఐ.జే.యూ. సెక్రెటరీ జనరల్ సోమసుందర్



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 19 మనం : జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ గాంధీజీ జయంతి రోజున జాతీయ కోర్కెలదినం జయప్రదం చేయాలని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐ.జే.యు.) సెక్రటరీ జనరల్ డి . సోమసుందర్ పిలుపు ఇచ్చారు. తాడేపల్లిగూడెం ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో సోమసుందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిపాయిపేట భవననిర్మాణ కార్మిక సంఘంలో సమావేశానికి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మైలవరపు రవి కిరణ్ అధ్యక్షత వహించారు. సోమసుందర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రద్దు చేసిన వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని వెంటనే పునరుద్ధరించాలని, జర్నలిస్టుల భద్రతకోసం కేంద్ర ప్రభుత్వం ఒకప్రత్యేక చట్టం చేయాలని , దేశంలో మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ అక్టోబర్ రెండవ తేదీ గాంధీజీ జయంతి రోజున జాతీయ స్థాయిలో కోర్కెల దినం పాటించాలని ఐ.జే.యు. పిలువు ఇచ్చిందని తెలిపారు. యడ్లపల్లి మురళీకృష్ణ , రామరాజు , గజపతి వరప్రసాద్ , ప్రెస్ క్లబ్ కార్యదర్శి కొడమంచిలి ఆశీర్వాదరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దోజు మురళీ కృష్ణ, కోశాధికారి కాసాని వెంకటరత్నం, సీనియర్ పాత్రికేయులు షేక్ ఖాదర్ మొహిద్దీన్, యద్దనపూడి సుబ్బారావు, రామకృష్ణ, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు రాంబాబు, శీలి రాజు, కళ్యాణ్, సహాయ కార్యదర్శులు కృష్ణ , సంతోష్, సతీష్, అడ్డగర్ల చిన్న, కార్యవర్గ సభ్యులు లక్ష్మణరావు, ఎల్లారావు, నాగ ప్రసాద్, రాఘవేంద్రరావు, కమల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బలరామ జయంతి వేడుకలు



ఏలేశ్వరం,సెప్టెంబర్,19(మనం న్యూస్)ః ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామంలో శనివారం సాయంత్రం రైతుల ఆరాధ్యదైవం శ్రీ భగవాన్ బలరాముల వారి జయంతి వేడుకలను రైతు దినోత్సవంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామ అధ్యక్షుడు తోట మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా,ఉపాధ్యక్షుడు నీలగిరి చిట్టిబాబు పాల్గొని బలరాముల వారి విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో తోట రాఘురావుతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 19 మనంన్యూస్ః స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా తణుకు బస్టాండ్ వద్ద తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర (సాసా) పరిశుభ్రత లక్ష్య విభాగాల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ హాజరయ్యారు. స్వచ్ఛత, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛమైన తాడేపల్లిగూడెం నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఏసుబాబు , ఈతకోట తాతాజీ , కాశి , పౌరపాలక సంఘం ఉద్యోగులు , కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎల్ నినో దెబ్బ ప్రారంభమైనటేనా!

- ముందు వేసవిని తలపిస్తున్న ఎండలు
- ఎండల వేడిమికి తాళలేకపోతున్న ప్రజలు



పాలకొల్లు, సెప్టెంబర్ 19,మనం ప్రతినిధి: తీవ్ర వర్షాభావ పరిస్థితి గా నామకరణం చేసిన ఎల్ నినో కాల సమయం వచ్చేసినట్లేనా అని ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం నాడు వాతావరణ పరిస్థితి చూస్తే అవును అనిపిస్తోందంటున్నారు. శుక్ర, శనివారాల వాతావరణ పరిస్థితి చూస్తే ఎండలు ముందు వేసవిని తలపిస్తున్నాయంటున్నారు. ఈ రెండు రోజుల్లో కాచిన ఎండ కారణంగా వేసవి మాదిరిగా ఉదయం 11 గంటల నుంచి ప్రజలు ఇల్ల వద్దనే ఉండిపోయవలసిన పరిస్థితి వచ్చింది. దీంతో రోడ్లన్నీ నిర్మానుస్యంగా మారాయి. పిల్లలు, వృద్ధులు,రోగులు ఎండలు వేడి మీకి తట్టుకోలేక విలువలాడిపోతున్నారు ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే కాలం ఎల్ నినో గడ్డు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలలో కొంత ఆందోళన కూడా నెలకొంది. వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని కొందరు నిపుణులు చెప్పడం గమనార్హం.ఏది ఏమైనప్పటికీ పరిస్థితులు ఎలా ఉంటాయనేది వేచి చూడాల్సిందే మరి.

# పిల్లలకు జంక్ ఫుడ్ వద్దు ఇంటి ఉంటే ముద్దు

- సెక్టర్ సూపర్వైజర్లు మోహనరాణి,హేమ తులసి



పోడూరు, సెప్టెంబర్ 19, మనం ప్రతినిధి: పోషణ మాస కార్యక్రమంలో భాగంగా శనివారం పాలకొల్లు ప్రాజెక్ట్ పరిధిలోని పోడూరు మండలంలో గుమ్ములూరు సెక్టార్ బోల్లేటిగుంట, జిన్నూరు సెక్టార్ దక్షిణపేట అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాస కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీఓ ఎం. ఉమా ఆదేశాల మేరకు జిన్నూరు, గుమ్ములూరు సెక్టార్ సూపర్వైజర్లు కె. మోహనరాణి, హేమతులసీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్లు గర్భిణులు,బాలింతలకు ఆరోగ్యం, పోషకాహారంపై పలు సూచనలు, సలహాలు అందించారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న తాజా, వేడి ఆహార పదార్థాల్లోని పోషక విలువలను వివరించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే పిల్లలకు జంక్ఫుడ్ వద్దు ఇంటివంటే ముద్దు అని , ప్యాకెట్ ఆహార పదార్థాలు, శీతల పానీయాలకు దూరంగా ఉంచాలని సూచించారు.ఇంట్లోనే తయారు చేసిన తాజా, పోషక విలువలున్న ఆహారాన్ని పిల్లలకు అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



- ఎస్ ఐ సత్యనారాయణ

కాట్రేనికోన సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి : విద్యార్థులందరూ ప్రస్తుత చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కాటేనికొన ఎస్ ఐ వి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల నందు మహిళా సంరక్షణపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థునులు సోషల్ మీడియా వాడకం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ , శక్తి యాప్ డౌన్లోడ్ దాని ఉపయోగాలు , ఫోక్సో చట్టం , మైనర్ గా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగర్త లు తెలియజేశారు. తల్లిదండ్రులను సమాజంలోని పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని, ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు అనంతరం విద్యార్థునుల మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేయించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ ఎం నాగరాజు మహిళా కానిస్టేబుల్ లక్ష్మి , కానిస్టేబుల్ లు చిన్నారావు , మహిళా సంరక్షణ కార్యదర్శి టి భాగ్యలత కళాశాల అధ్యాపకులు, ఎం సతీష్, ఏ శ్రీనివాస్, డి హెచ్ వి సత్యనారాయణ, సలోమి, సువర్ణ, అశోక్, కృష్ణ, అప్పల స్వామి,సంతోషి కువారి, వెంకటేశ్వర రావు, శ్రీనుబాబు విద్యార్థి నులు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు అందజేత



ఏలేశ్వరం,సెప్టెంబర్19(మనం న్యూస్): పట్టణంలోని లింగవరం కాలనీలో నివాసం ఉంటున్న నర్సి ఆద్య పుట్టినరోజు సందర్భంగా వివేకానంద సేవా సమితి పట్టణ ఇంచార్జ్ పెండ్యాల రాజు,సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 30 మంది నిరుపేద వృద్ధులకు ఆహార పొట్లాలను శనివారం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆధ్యా బంధువులు నరేంద్ర, జువ్విన నాని,జుత్తుల వీరబాబు వివేకనంద సేవాసమితి సభ్యులు జుత్తుల శ్రీను, ముత్యాల సత్తిపండు, వాగు కృష్ణ, డోర్ల రమేష్, మట్టే చిన్న, మెడికల్ షాప్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

# సీతారామ కళాశాలలో ఉత్సాహంగా డిగ్రీ ఫ్రెషర్స్ డే వేడుకలు




శంఖవరం సెప్టెంబర్ 19 మనం ప్రతినిధి: శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో ఉన్న సీతారామ కళాశాల లో శనివారం డిగ్రీ ప్రెషర్డే వేడుకలు కళాశాల ఆవరణలో విద్యార్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. సీనియర్ డిగ్రీ విద్యార్థులు ఈ ఏడాది మొదటి సంవత్సరం డిగ్రీ విద్యార్థులకు విందు ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొని నృత్యాలు, పాటలు, సందేశఆత్మక నాటికలు వేసి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిహెచ్ వీరబాబు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో చదువుకే అత్యంత ప్రాధాన్యత ఉందని ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం మొదటి సంవత్సరం డిగ్రీ పరీక్ష ఫలితాల్లో 10 కి 10 పాయింట్లు సాధించి యూనివర్సిటీ పరిధిలో ఉత్తమ విద్యార్థిగా నిలిచిన పోతంశెట్టి హరిణి ని అభినందించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ లు అక్కరావు, మురళీకృష్ణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# బ్లెస్సీ జన్మదిన వేడుకల్లో మురళీకృష్ణం రాజు

ప్రత్తిపాడు,సెప్టెంబర్,19:-(మనం న్యూస్): ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో నామా సుబ్బారావు కుమారుడు ఆనంద్ కుమార్తె బ్లెస్సీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

జన్మదిన వేడుకల వేదిక వద్ద చిన్నారి బ్లెస్సీని ఆశీర్వదించి, ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మురళీకృష్ణం రాజు ఆత్మీయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మచ్చర్ల దాసు, కోలా తాతబాబు, జువ్వల దొరబాబు, నల్ల వెంకటేష్, పాస్టర్ జోసెఫ్, యాళ్ల ఏసు, జువ్వల ముసలయ్య, ముడదా ఏసు, బీజా అప్పలరాజు, మారెళ్ల అప్పనబాబు, సింగలూరి శేఖర్, నామా కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పెనుకొండ అభివృద్ధే లక్ష్యం

- మున్సిపాలిటీపై కూటమి జెండా ఎగరేయాలి
- రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- అమృత్ పథకంతో రూ.100 కోట్లతో ఇంటింటికి మినరల్ తాగునీటి సౌకర్యం: మంత్రి సవిత
- అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కూటమి శ్రేణులకు మంత్రి సవిత పిలుపు



**పెనుకొండ సెప్టెంబర్ 19 మనం న్యూస్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పెనుకొండ మున్సిపాలిటీని కూటమి పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. శనివారం పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ స్థానిక ఎన్నికల ఇన్చార్జి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల సమన్వయం, మున్సిపల్ ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పెనుకొండ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీ అందించారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రస్తుతం టీడీపీ ఆధీనంలో లేకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 26 నెలల్లో పెనుకొండ పట్టణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.

పెనుకొండ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించే లక్ష్యంతో అమృత్ పథకం కింద సుమారు రూ.100 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్కు రూ.3 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రూ.8 కోట్లతో మూడు ఎకరాల్లో సద్భావన భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.50 లక్షలతో షాదీ మహల్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాపు భవన్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.64 లక్షలతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశామని, 1,250 మంది అర్హులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.పెనుకొండ అభివృద్ధి బాధ్యత నాది. పార్టీని బలోపేతం చేసి మున్సిపాలిటీని కైవసం చేసుకునే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని అని మంత్రి సవిత అన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత పెంచుకుని, రాబోయే ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి



**బేతంచేర్ల సెప్టెంబర్19 (మనం న్యూస్):** నంద్యాల జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని వెంటనే డోన్ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ వైఎస్సార్ కాంగ్రెస్ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామాంజి షాషా ఏఐటీయూసీ మండల కార్యదర్శి తాలూకా తిరుమలేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ ఏఐవైఎఫ్ ఉదయ్ మధు రైతులు రమేష్ రెడ్డి గోపి లు డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారం చెల్లించాలని రైతుల రుణాలను మాఫీ చేసి రుణాలను రీషెడ్యూల్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు వ్యవసాయంపై ఆధారపడిన రైతు కుటుంబాల పిల్లలకు అన్ని రకాల విద్యా ఫీజులను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు కరువు పరిస్థితుల నేపథ్యంలో పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని పశువులను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.

# పిఎండిఎస్ విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**అమరాపురం, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** అమరాపురం మండలం, బసవనపల్లి గ్రామంలో ఓ రైతు వక్క తోటలో వేసిన పిఎండిఎస్ విధానాన్ని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శనివారం పరిశీలించారు. నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ పథకం ద్వారా నిర్మించిన అమరాపురం, బసవనపల్లి గ్రామాల్లో నీటి సంపులను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ బసవనహళ్లి గ్రామంలోని రైతు పుష్పలత భర్త శంకరప్ప వక్క తోటలో వేసిన పిఎండిఎస్ సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖా ముఖిగా మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్క రైతులు కూడా పిఎండిఎస్ వేసే విధానాన్ని అనుసరించాలని రైతులకి సూచించారు.పిఎండిఎస్ పంట విధానం పట్ల రైతులకు కలిగే ప్రయోజనం, ఉపయోగాలు గురించి అమరాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి మంజునాథ్ స్పష్టంగా వివరించారు. విత్తనాలను పెల్లెటైజేషన్ చేయడం ద్వారా విత్తనానికి రక్షణ కవచంగా ఉండి వర్షం వచ్చినప్పుడు పంటలు మొలకెత్తుతాయని ఆయన తెలియజేశారు. అలాగే ఈ విధానం ద్వారా పంటకు ఇచ్చిన నీరు ఆవిరి కాకుండా పంటకు మల్చింగ్ లాగా ఉపయోగపడుతుందన్నారు. దీనిద్వారా తేమను నిలుపుకునే గుణం పెరుగుతుందన్నారు.కలుపు మొక్కలు తగ్గుతాయని, పంట పొలాలు 365 రోజులు గ్రీన్ కవర్ పచ్చదనం ఉంటుందన్నారు. రైతులు కూరగాయలు, ఆకుకూరల ద్వారా కొంత ఆర్థిక లాభం కూడా పొందెందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ముఖ్యంగా పశువులకు మేతగా ఉపయోగపడుతుందని రైతులకు తెలియజేశారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో వీలైతే రైతులు నీటి సదుపాయం ఉన్న వక్క రైతుల నుంచి ఒక రక్షకతడిని పంటలకు అందించాలని ఎఓ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మడకశిర ఎడిఎ కృష్ణ మీనన్,సిరికల్చర్ ఎడి హనుమంతు నాయక్, ఎంపీడీఓ డి. రామారావు,తహసీల్దార్ బి. హనుమంతు, అమరాపురం, గుడిబండ ఎఓలు మంజునాథ్,వీరనరేష్, ఏపీఓ శివన్న తదితరులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు సన్మానం




**బేతంచేర్ల సెప్టెంబర్19 (మనం న్యూస్):** పట్టణంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఫజల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులకు మెమెంటో దృశ్యాలువ పూలవమాలలతో సన్మానం 2021 నుండి 2026 వరకు ప్రజా ప్రతినిధులైన ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి జడ్పిటిసి శివ పార్వతి ఎంపీటీసీ సభ్యులుగా 15 మందిని మండలంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకున్నారు ఎంపీడీవో పజిల్ రెహమాన్ అన్నారు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పజిల్ రెహమాన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన 25 వ మండల సర్వసభ్య సమావేశం లో వివిధ శాఖల అధికారులు మండలంలో ఉన్న ప్రజల సమస్యలపై ప్రభుత్వం ల ఆదేశాల మేరకు చేసిన అభివృద్ధి పనులు శాఖల అధికారులు తెలిపారు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా బేతంచేర్ల మండల ప్రజలు గెలిపించుకున్నారు మండలం లో త్రాగునీరు సమస్య విద్య వైద్యం లేక మండల ప్రజలకు ఇబ్బంది పడుతున్నారని వారి సమస్యలు పరిష్కరించాలని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేసి మెజార్టీతో గెలిచారని డోన్ నియోజకవర్గాని కి అభివృద్ధి పనులు చేశారని బేతంచేర్ల మండలంలో త్రాగునీరు కోసం 350 కోట్లతో గోరకల్లు రిజర్వాయర్ నుంచి స్వచ్ఛమైన నీరు అందించారని విద్య కోసం మండల లో ఉన్నత చదువు కోసం ఇతర పట్నాలకు వెళ్లి చదివేవారు బుగ్గన రాజేంద్రరెడ్డి ఎడ్యుకేషన్ హబ్ గా ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రభుత్వ ఐటిఐ గురుకుల పాఠశాల ఏర్పాటుచేసి ఇతర జిల్లాల వారు ఇక్కడకు వచ్చి చదువుతున్నారని ప్రధాన రహదారు కోసం కోట్ల నిధులతో రోడ్లు వెడల్పు నేషనల్ హైవే వైద్యం కోసం బేతంచేర్ల పట్టణంలో 30 పడకల హాస్పిటల్ గా వైద్యులు ప్రతిరోజు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు ఏర్పాటుచేసి ప్రతి శాఖ అధికారులు గ్రామస్తుల సమస్యలు అక్కడే పరిష్కారం అయ్యేలా ఏర్పాటు చేశారని గత ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించారని నేను ప్రజలకు సేవ అందించాలని మాజీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథరెడ్డి సహకారంతో ఎంపీపీగా ప్రజా ప్రతినిధిగా గ్రామాల సమస్యలు పరిష్కరించామని జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులు సహకారంతో ప్రతి గ్రామానికి త్రాగునీరు అభివృద్ధి పనులు చేసి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని అన్నారు ఎంపీడీవో ఫజల్ రెహమాన్ మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యలు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి చెప్పిన వెంటనే స్పందించి వెంటనే ఆ సమస్యను పరిష్కరించేవారు వారు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేవారు వారి సేవలు కావాలని అన్నారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శివ పార్వతి ఎంపీటీసీ సభ్యులు మాజీ సర్పంచులు మండల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, సెప్టెంబర్ 19మనం న్యూస్:** జిల్లాలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను గుర్తించి, ఆయా పరిశ్రమల భాగస్వామ్యంతోనే శిక్షణ అందించి, అనంతరం ఉపాధి అవకాశాలు



కల్పించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖల అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలు, ప్రస్తుతం డిమాండ్లో ఉన్న నైపుణ్యాలను ముందుగా గుర్తించాలని, వాటికి అనుగుణంగా యువతకు శిక్షణ అందించి, శిక్షణ పూర్తైన వెంటనే ఉద్యోగాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్మెంట్ అధికారులను ఆదేశించారు... ఈ ప్రక్రియను ఆలస్యం చేయకుండా 10 రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.. ఇఖిఖ ద్వారా నిర్మించిన సీడాప్ భవనాలు, ఐటీఐల్లోని అ్కఖిఖ్రఇ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను అవసరమైన సంస్థలకు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి జిల్లాలో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుకు వస్తున్న సంస్థల మానవ వనరుల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని, వాటికి అనుగుణంగా స్థానిక యువతకు శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల అమలును మరింత వేగవంతం చేసి రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలన్నారు.. కఱఓగ్గ (ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన) కింద వచ్చిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన బ్యాచ్లను వేగవంతంగా పూర్తి చేసి తదుపరి బ్యాచ్లను ప్రారంభించాలన్నారు. సమావేశంలో సిపిఓ భారతి, డీఈవో సుధాకర్, సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, ఉపాధి కల్పనధికారి దీప్తి, ఆర్ఐఓ లాలప్ప, స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంటల ను పరిశీలించిన వైసీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్



**శింగనమల సెప్టెంబర్ 19 మనం న్యూస్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గంలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ మరియు రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రటరీ బొమ్మన శ్రీరాంరెడ్డి నేతృత్వంలో పంట పొలాల పరిశీలన కార్యక్రమం కొనసాగింది. శింగనమల మండలం నాగులగుడ్డం నుంచి ఈస్ట్ నరసాపురం వరకు సాగునీరు అందక నిలువునా ఎండిపోతున్న పంట పొలాలను శైలజనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నేరుగా పొలాల్లోకి వెళ్లి ఎండిపోయిన పైర్లను చేతిలోకి తీసుకుని, రైతుల కష్టాలను, వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు.


ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ మాట్లాడుతూ

'రైతు కళ్లముందే పంట ఎండిపోతుంటే.. ఆ రైతు గుండె ఎంతగా మండుతుందో ఈ పొలాల్లోకి వస్తే తెలుస్తుంది. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన పంటకు నీళ్లు అందకపోవడం రైతు దురదృష్టం కాదు.. ప్రభుత్వ వైఫల్యం.

సాగునీటి నిర్వహణలో ముందుచూపు లేకపోవడం, అవసరమైన సమయంలో నీటిని అందించకపోవడం వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. పంట చేతికందాల్సిన సమయంలో రైతు చేతిలో మిగిలింది ఎండిపోయిన పైరు.. అప్పుల భారం.. కన్నీళ్లే. రైతు పొలంలో నిలబడి పరిస్థితిని చూసే ప్రభుత్వం కావాలి.. కార్యాలయాల్లో కూర్చొని లెక్కలు చెప్పే ప్రభుత్వం కాదు కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనా వేయాలి. సాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం చూపడంతో పాటు, పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తగిన పరిహారం అందించాలి.

రైతు కన్నీరు తుడిచే వరకు.. రైతు హక్కుల కోసం వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగుతుంది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర స్వచ్ఛతా హి సేవ 2026



**బేతంచేర్ల సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** పట్టణంలో నగర పంచాయతీ లోని వార్డులు మార్కెట్ ప్రాంతాల్లోమున్సిపల్ కమిషనర్ హరి ప్రసాద్ ప్రజలకు అవగాహన నిర్వహించారు ప్లాస్టిక్ నిషేధంసింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని చెత్త వేరుచేయడం చెత్తను ఇంటి వద్దనే నాలుగు రకాలుగా వేరుచేసి మున్సిపల్ చెత్త బండికి అందించాలని తెలియజేయడమైనది పరిసరాల శుభ్రతఇళ్లతో పాటు పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరడమైనది మరుగుదొడ్ల వినియోగం వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించాలని రోడ్లు కాలువలలో చెత్త వేయవద్దు రోడ్లు మురుగు కాలువలలో చెత్త వేయకూడదని అలా వేస్తే దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించడమైనది మొక్కలు నాటడం కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు మధు శానిటేషన్ మరియు సచివాలయ సిబ్బంది మున్సిపల్ ఉద్యోగులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిఐఐ భాగస్వామ్య సదస్సు

- 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహణ
- ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- నగరంలోని జేఎన్టీయూలో ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్



**అనంతపురంకలెక్టరేట్, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో వచ్చే అక్టోబర్ 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీ ఈ డి బి ) ఆధ్వర్యంలో సిఐఐ (కాన్ఫడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ ) పార్టనర్షిప్ సుమ్మిట్ - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించబోతుండగా, ఇందుకు సంబంధించి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీఈడిబి) సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం సిఐఐ భాగస్వామ్య సదస్సు - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, అతిథి గృహంలో ముందస్తుగా ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఏపీఈడిబి సీఈఓ మాట్లాడుతూ సిఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే డెలిగేట్స్, వీఐపీల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేఎన్టీయూలో ఆడిటోరియం అందంగా కనిపించాలని, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ముందుగానే పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, జేఎన్టీయూ అతిథి గృహం, తదితర ప్రాంతాల్లో పర్యటించి సీఈఓ పలు సూచనలు జారీ చేశారు.

ఈ సిఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, సీనియర్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొంటారు. జిల్లాలో ప్రాధాన్యత రంగాలకి అనుగుణంగా ఉన్న స్థానిక అవకాశాలను ప్రదర్శించడం, పెట్టుబడి అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడం, మరియు ప్రాంతీయ ఎంఎస్ఎంఈలు మరియు పరిశ్రమలను జాతీయ మరియు ప్రపంచ భాగస్వాములతో అనుసంధానించడం చేపట్టనున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ మేనేజర్ అనంత్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, జేఎన్టీయూ విసి సుదర్శన్ రావు, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్డీవో ప్రేమంతకుమార్, తహసీల్దార్ రాజా, నెడ్ క్యాప్ మేనేజర్ కిరణ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రతో పరిశుభ్రతకు పెద్దపీట

- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పథకంతో పరి శుభ్రత ప్రభుత్వ పెద్ద పీఠం వేసిందని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ తెలిపారు. మడకశిర నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తో పాటు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో మడకశిరను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు.

పరిశుభ్రమైన మడకశిర, పచ్చని మడకశిర లక్ష్యంగా మనమందరం పాటు పడుదామని కమిషనర్ మురళిదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది, నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ హై లెవెల్ కమిటీ పిఎసి స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం

## హాజరైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు రఘువీరా రెడ్డి



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** విజయవాడ లోని ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన హై లెవెల్ కమిటి పిఎసి, స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటి సమావేశం నకు మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు,

రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటి చైర్మన్ డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశం నకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ, ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ పివి మోహన్ కు రఘువీరారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు పళ్ళంరాజు, జేడీ శీలం,సి డబ్ల్యాసి సభ్యుడు కొప్పుల రాజు,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్సీ, గిడుగు రుద్రరాజు, ఎఐసిసి కార్యదర్శి ప్రసాద్, తులసి రెడ్డి, మస్తాన్, కమలమ్మ తదితరులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనం న్యూస్:** మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులనుఎమ్మెల్యే స్వయానా స్వీకరించారు.

ప్రజాదర్బార్లో ప్రధానంగా పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, ఇతరాత్ర సమస్యలపై అర్జీలు రావడం విశేషం. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి ఆయా శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇవే నా చివరి ఆసియా గేమ్స్ కావొచ్చు: స్టార్ షట్లర్



భారత స్టార్ షట్లర్ హెచ్.ఎస్. ప్రణయ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ఆసియా క్రీడలే తనకు చివరివి కావొచ్చని తెలిపాడు. ''మరో నాలుగేళ్ల తర్వాత ఇదే స్థాయిలో ఆడుతానో లేదో తెలీదు. బహుశా ఇవే నా చివరి ఆసియా క్రీడలు కావొచ్చు. ప్రస్తుతం శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నా. ఇటీవల వియత్నాం ఓపెన్లోనూ కొంతకాలం తర్వాత మంచి ప్రదర్శన చేశాను. గత ఆసియా క్రీడల్లో స్వర్ణాన్ని తృటిలో చేజార్చుకున్నాం. ఈసారి ఫైనల్కు చేరి బంగారు పతకం గెలుస్తామని ఆశిస్తున్నా'' అని ప్రణయ్ చెప్పుకొచ్చాడు.

అయితే 2028లో లాస్‌ఏంజెలెస్లో జరిగే ఒలింపిక్స్ ఆశలను మాత్రం అతడు వదులుకోలేదు. ''ఎల్ఏ 2028ఏ నా లక్ష్యం. రాబోయే ఏడాదిన్నర వరకు గట్టిగా ప్రయత్నిస్తా. ఒలింపిక్స్కు వెళ్లే అవకాశం ఉందని అనిపిస్తే కొనసాగుతా. లేకపోతే ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటా. కిదాంబి శ్రీకాంత్ కోర్టులో చూపిస్తున్న పట్టుదల నాకు స్ఫూర్తినిస్తోంది. అతన్ని చూస్తుంటే గర్వంగా ఉంది. నేనూ అలా ఆడగలననే నమ్మకం వస్తుంది'' అని పేర్కొన్నాడు. డబుల్స్ స్టార్ ఆటగాడు చిరాగ్ శెట్టి మాట్లాడుతూ.. ''నిరుడు రజతం సాధించాం. గతాన్ని పక్కనపెట్టి ఈసారి అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాం. కోర్టులో చెలరేగే పులుల్లా ఆడి.. దేశానికి బంగారు పతకం అందిస్తాం. రాబోయే పది రోజుల కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా'' అని పేర్కొన్నాడు.




# 'రాత్రంతా నిద్రపోలేదు.. పొద్దునే ఇలా.. నాకిది గర్వకారణం'

జపాన్ వేదికగా ఆసియా క్రీడలు- 2026 ఘనంగా మొదలయ్యాయి. ఈ ఆరంభ వేడుకల్లో ఒలింపిక్ పతకాల విజేత, షూటర్ మనూ భాకర్తో పాటు.. కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్ ఫ్లాగ్ బేరర్లుగా వ్యవహరించారు. నిజానికి తొలుత మనూ భాకర్తో కలిసి షాట్పుటర్ తజిందర్ పాల్ సింగ్ తూర్ ఫ్లాగ్ బేరర్గా ఎంపికయ్యాడు.

**ఊహించని అవకాశం**

అయితే, కిట్ ఆలస్యంగా రావడం వల్ల మనూకు జతగా ఉన్న మరో భారత పతాకధారిని మార్చాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పవన్ సెహ్రావత్కు ఊహించని విధంగా ఫ్లాగ్ బేరర్గా అవకాశం వచ్చింది. మనూ భాకర్తో కలిసి అతడు భారత పతాకధారిగా వ్యవహరించాడు.

**రాత్రి అసలు నిద్రపోనేలేదు**

ఈ నేపథ్యంలో పవన్ సెహ్రావత్ మాట్లాడుతూ.. ''నాకిది అత్యంత గర్వించదగ్గ క్షణం. నిజానికి మాకు ప్రాక్టీస్ షెడ్యూల్ ఉంది. అందుకు తగినట్లుగానే మేమంతా ప్రాక్టీస్కు సిద్ధమయ్యాము. రాత్రి అసలు నిద్రపోనేలేదు. పొద్దునే జిమ్కు వెళ్లి నేరుగా స్టేడియానికి వచ్చేశాను. రాత్రంతా నేను మేల్కొనే ఉన్నాను. అయినా సరే జాతీయ పతాకాధారిగా వస్తున్నానని తెలిసి ఎక్కడా లేని ఉత్సాహం, శక్తి వచ్చాయి. నిజంగా నాకు ఇది గర్వకారణం.

**ఆమె ఒక స్ఫూర్తిదాయక అథ్లెట్**

నిజానికి నాకు ఫ్లాగ్ బేరర్గా అవకాశం వచ్చిందని ఈరోజు ఉదయమే అందరికీ చెప్పాను. అయితే, మా అన్నయ్య అంకుర్కు మాత్రం గత రాత్రే మెసేజ్ చేశాను. ఇక మనూ భాకర్ గురించి ప్రత్యేకంగా నేను చెప్పాల్సింది ఏమీ లేదు. ఆమె ఒక స్ఫూర్తిదాయక అథ్లెట్. ఇంతకు ముందే ఆమెను ఓసారి కలిశాను. ఒలింపిక్ పతక విజేతతో కలిసి ఫ్లాగ్ బేరర్గా ఉండటం గర్వించదగ్గ విషయం. మా జట్టును ఉద్దేశించి మనూ గతంలో స్ఫూర్తిదాయక ప్రసంగం ఇచ్చారు. ఇప్పుడిలా ఆమెతో కలిసి నేను పతాకధారిగా ఉండటం ఊహించని విషయం'' అని పేర్కొన్నాడు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం పవన్ సెహ్రావత్కు సంబంధించిన వీడియోను విడుదల చేసింది.




# వైభవ్‌లో ఆ స్కిల్స్ లేవు.. టెస్టు క్రికెట్‌కు సెట్ కాడు

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే తన విధ్వంసకర బ్యాటింగ్తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వైభవ్.. భవిష్యత్తులో టెస్టు ఫార్మాట్ లో రాణించడానికి ఇబ్బంది పడతాడని పనేసర్ అభిప్రాయపడ్డాడు.

అండర్-19 తో పాటు ఐపీఎల్ లోనూ సంచలన ప్రదర్శన చేసి భారత సీనియర్ జట్టులోకి అడుగు పెట్టిన వైభవ్.. తన అద్భుతమైన ఆటతీరుతో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అఫ్గానిస్తాన్ తో టీ20 సిరీస్ కు ఎంపికైనప్పటికి తుది జట్టులో మాత్రం ఈ చిచ్చర పిడుగుకు చోటు దక్కలేదు. కాగా సూర్యవంశీ కేవలం వైట్ బాల్ క్రికెట్ లోనే కాదు సుదీర్ఘ ఫార్మాట్ లోనూ రాణిస్తున్నాడు.

ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్ లోనూ ఈస్ట్ జోన్ తరఫున సూర్యవంశీ సత్తాచాటాడు. అంతకుముందు ఆస్ట్రేలియా అండర్-19తో జరిగిన యూత్ టెస్టు సిరీస్ లోనూ అతడు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అయినప్పటికి వైభవ్ టెస్టు క్రికెట్ లో విజయవంతం కాలేడని పనేసర్ వ్యాఖ్యానించడం గమనార్హం.

'వైభవ్ సూర్యవంశీ టెస్టు క్రికెట్ లో సక్సెస్ అవుతాడని నేను అనుకోవడం లేదు. అతడి ఆ స్థాయికి తగ్గ స్కిల్స్ లేవు. ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్స్ లో టెస్టులు, టీ20లు రెండింటిలోనూ టాప్-10లో కొనసాగుతున్న ఏకైక బ్యాటర్ హ్యారీ బ్రూక్ మాత్రమే' అని పనేసర్ పేర్కొన్నాడు.



# నా దృష్టిలో అందమంటే అదే.. బాడీ షేమింగ్‌పై స్పందించిన కత్రినా

నటి కత్రినా కైఫ్ శరీరాకృతిపై కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో అనవసరపు చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఆమెపై వచ్చిన ట్రోల్స్ను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు నటికి మద్దతుగా నిలిచారు. తాజాగా ఈ అంశంపై కత్రినా పరోక్షంగా స్పందించారు. తన దృష్టిలో అందం అంటే ఆరోగ్యంగా ఉండడమేనని అన్నారు.

ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన ప్రారంభంలో కఠినమైన అందాల కొలతలకు ప్రాధాన్యం ఇచ్చేదాన్నని.. అయితే సమయంతో పాటు అందంపై తన దృక్పథం పూర్తిగా మారిపోయిందని కత్రినా తెలిపారు. ''నేను పరిశ్రమకు వచ్చిన తొలినాళ్లలో అందం అంటే.. ఇలానే ఉండాలి అని కొన్ని నియమాలు పెట్టుకున్నాను. కానీ, ఇప్పుడు నా దృష్టిలో అందంగా ఉండటం అంటే.. మనకి మనం ఉన్నతంగా కనిపించడమే. మన శరీరాన్ని ఆరోగ్యంగా కాపాడుకుంటూ.. మనసును ప్రశాంతంగా ఉంచడమే అసలైన సౌందర్యం. పైకి కనిపించేది అందం కాదు.. మనం ఎంత ఆత్మవిశ్వాసంతో ఉన్నామనేది ముఖ్యం'' అని కత్రినా అన్నారు.

ప్రసవానంతరం బరువు పెరిగారంటూ కత్రినా కైఫ్పై వచ్చిన ట్రోల్స్ను సెలబ్రిటీలు ఖండిస్తున్నారు. తాజాగా నటి ఖుష్బూ కూడా దీనిపై పోస్ట్ పెట్టారు. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత శరీరంలో అనేక హార్మోన్ల మార్పులు రావడం సహజమని, దానిని అర్థం చేసుకోకుండా హేళన చేయడం సరికాదని హితవు పలికారు. గతంలో తాను కూడా ఇలాంటి బాడీ షేమింగ్ విమర్శలను ఎన్నోసార్లు ఎదుర్కొన్నానని తెలిపారు. మహిళలు తమను తాము ప్రేమించుకోవడం ముఖ్యమన్నారు. అదే విమర్శకులకు మనమిచ్చే గట్టి సమాధానమని చెప్పారు.



# పురుషులకు కూడా నెలసరి రావాలి అప్పుడే ఆ బాధ తెలుస్తుంది: శ్రుతి హాసన్

కోలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. విజయ్ సేతుపతితో కలిసి 'ట్రెయిన్', దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాలలో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఓ వైపు నటిగా రాణిస్తూనే.. సింగర్గా కూడా పలు చిత్రాల్లో పాటలు పాడుతున్నారు. దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'లోనూ ఆమె ఒక పాటకు తన మధురమైన స్వరాన్ని అందించారు. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ శృతి హాసన్ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు. తాజాగా, సోహా అలీ ఖాన్ నిర్వహించిన ఒక ప్రత్యేక పాడ్కాస్ట్లో పాల్గొన్న శృతి హాసన్.. పీరియడ్స్ సమయంలో వచ్చే తీవ్రమైన నొప్పులు, వాటి గురించి సమాజంలో ఉండే అపోహలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సింద్రోమ్) సమస్య ఉందని, దీని కారణంగా పీరియడ్స్ సమయంలో తాను చాలా బాధను అనుభవిస్తానని తెలిపారు. తన సినీ కెరీర్ ఆరంభంలో ఈ విషయాల గురించి మాట్లాడేందుకు తాను కొంచెం మొహమాటపడేదానినని, దీని గురించి ఎవరూ పెద్దగా చర్చించరని భావించానని శృతి చెప్పారు. కానీ తోటి నటులు తమ మోకాలి సర్జరీ వంటి సమస్యల గురించి చెప్పినప్పుడు డైరెక్టర్లు సెట్లో సర్దుబాటు చేసేవారని, తాను మాత్రం పీరియడ్స్ గురించి చెప్పడానికి సంకోచించేదానినని తెలిపారు. మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుంటుందని, అప్పుడు ఆటోమేటిక్గా వర్క్ కాంట్రాక్ట్లో పీరియడ్ సెలవులు కూడా వచ్చి ఉండేవి కదా అని తాను అనుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా పురుషులకు కూడా నెలసరి రావాలని అప్పుడే మహిళలు పడే బాధ వాళ్లకు తెలుస్తుందని.. తాను దాదాపు 1000సార్లు దేవుడిని ప్రార్థించానని చెప్పారు. అయితే ఒకసారి తాను పీరియడ్ విషయం చెప్పినప్పుడు, ఆ దర్శకుడికి కూతురు ఉండటంతో ఆ కష్టాన్ని అర్థం చేసుకుని తనకు పూర్తి సహకారం అందించారని, ఆ సంఘటన తర్వాతే తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని ఆమె వివరించారు.



# విలన్‌గాపాత్రలు వస్తే నటించడానికి కూడా సిద్ధమే: భాగ్యశ్రీ బోర్సే

టాలీవుడ్ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి మంచి క్రేజ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించినప్పటికీ అమ్మడు ఖాతాలో సరైన హిట్ పడలేదు. ఇక ఇటీవల భాగ్యశ్రీ 'లెనిన్' మూవీతో ఘనవిజయం సాధించి తన సత్తా చాటుకున్నారు. టాలీవుడ్, కోలీవుడ్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ భామ ఫుల్ ఫామ్లో ఉంది. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివ కార్తికేయన్ సరసన 'సెయాన్' చిత్రంలో హీరోయిన్గా నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తాజాగా, ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సినిమాలను ఎప్పుడూ జానర్ ఆధారంగా చూడనని, తనకు మాత్రం కథే ఎప్పుడూ మొదటి ప్రాధాన్యత అని భాగ్యశ్రీ స్పష్టం చేశారు. ఒక కథ నచ్చితే దాన్ని వదులుకునే ప్రసక్తే లేదని, దర్శకుడికి తనపై నమ్మకం ఉంటే.. ఆ పాత్రలో పూర్తిగా లీనమైపోతానని చెప్పారు. తాను కేవలం గ్లామర్ పాత్రలు లేదా హీరోయిన్గా మాత్రమే చేస్తానని చెప్పబోనని, తనలోని నటిని నిరూపించుకునే ఏ పాత్రనైనా చేయడానికి తాను సిద్ధమని తెలిపారు. తనను తాను సవాలు చేసుకునేలా విలన్ పాత్రలో నటించడానికి కూడా తాను వెనుకాడనని ఆమె తేల్చిచెప్పారు. తనలో తనకు బాగా నచ్చే లక్షణం తన మొండితనమని, తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని పేర్కొన్నారు. ఇక భాషల గురించి మాట్లాడుతూ.. తెలుగు, తమిళం ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నానని, త్వరలోనే ఈ రెండు భాషల్లో బాగా మాట్లాడగలుగుతానని ఆశిస్తున్నానని చెప్పారు. నటిగా తనలో చాలా కలలు ఉన్నాయని భాగ్యశ్రీ చెప్పుకొచ్చారు.

# 'పిఠాపురంలో.. అలా మొదలైంది'

## హృదయాన్ని హత్తుకునే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం

ప్రముఖ సీనియర్ దర్శకుడు మహేష్ చంద్ర ('ప్రేయసి రావే' ఫేమ్) తెరకెక్కించిన తాజా చిత్రం 'పిఠాపురంలో.. అలా మొదలైంది'. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పిఠాపురం నేపథ్యంగా ముగ్గురు ప్రేమ జంటలు, ముగ్గురు తండ్రుల కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. ముఖ్యంగా తండ్రీ-కూతుళ్ల మధ్య ఉండే పవిత్రమైన అనుబంధం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నేటి యువతకు అవసరమైన మంచి సందేశంతో పాటు ప్రేమ, సున్నితమైన హాస్యం, కుటుంబ సెంటిమెంట్ కలబోసిన చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్గా ఇది నిలిచింది. ఈ చిత్రానికి నూతన నటీనటులతో పాటు సీనియర్ నటుల అభినయం ప్రధాన బలంగా నిలిచింది. ప్రముఖ నటుడు డా. రాజేంద్ర ప్రసాద్ మరోసారి తండ్రి పాత్రలో జీవించి సినిమాకు ప్రాణం పోశారు. 'ఆ నలుగురు', 'ఇరుముడి' తరహా భావోద్వేగాలను ఆయన మరోసారి తెరపై ఆవిష్కరించారు. పిఠాపురం, హైదరాబాద్, గోవా వంటి రియల్ లొకేషన్లలో సహజమైన వాతావరణంలో షూటింగ్ జరపడం సినిమాకు మరింత ప్లస్ అయింది. ఎలాంటి వల్గారిటీ, బూతు మాటలకు తావులేకుండా కుటుంబం



అంతా కలిసి చూడదగ్గ చిత్రంగా దీనిని మలిచారు. హాస్యబ్రహ్మ డా. బ్రహ్మానందం వాయిస్ ఓవర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అయితే, కథలో సెంటిమెంట్ ,సందేశం మోతాదు కొంచెం ఎక్కువ కావడం వల్ల ద్వితీయార్థంలో సినిమా నెమ్మదించినట్లు అనిపించడం మైనస్గా చెప్పవచ్చు. గల్ఫ్ తదితర ప్రాంతాల్లోని ప్రవాస ఆంధ్రులకు, మన సంస్కృతి, తల్లిదండ్రుల విలువలను ఇష్టపడే వారికి ఈ చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది. దర్శకుడు మహేష్ చంద్రకు ఈ సినిమా మంచి కంబ్యాక్ ఇచ్చిందనే చెప్పాలి. రాజేంద్ర ప్రసాద్ అభిమానులకు, ఫ్యామిలీ ఆడియన్స్కు వారాంతంలో తప్పకనచ్చే చిత్రం ఇది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.